ప్రజాశక్తి

Vol. 4, no. 17

(Apr. 26, 1944)

బెజవాడ, 1944

Prajāśakti

Vol. 4, no. 17

(Apr. 26, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

Regd. No. M. 4486 0-2-0

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 17 | : సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ ★ పుచ్చలపల్లి సుందరయ్య తమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు | బుధవారం 26-4-44

"మే డే" జరపండి!

ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి, నండూరి ప్రసాదరావుగారు ఈ క్రింది విధంగా విజ్ఞప్తి గావిస్తున్నారు:

"మే డే" సమీపిస్తోంది. ఇది ప్రపంచ పీడిత ప్రజలందరికి ప్రతిజ్ఞాపాలనదినంగా జరుపబడుతూవస్తోంది. అందుచే ఆంధ్రరాష్ట్రమంతయు రైతులు "మేడే"ను దిగ్విజయంగా జరపాలి. నేటి విషమపరిస్థితులలో దేశీయులెల్లరు జాతిమత వివక్షతలు లేకుండ, పార్టీ విభేదాలెంచకుండా, ఏకమై దేశరక్షణకుపూనుకోవాలి. కరువుసమస్యను పరిష్కరించాలి. కాంగ్రెసు–ముస్లింలీగ్‌లమధ్య ఐక్యతకై పాటుపడాలి."

"మే" దినోత్సవంనాడు దేశభక్తులు తీసుకోవలసిన ప్రతిజ్ఞ

— చంద్ర రాజేశ్వరరావు

"మేడే" కష్టజీవులందరి పండుగ దినం. అనాడు కష్టజీవులు ప్రపంచమంతటా సమావేశమయి, భవిష్యత్కర్తవ్యాన్ని నిర్ణయించుకుంటారు. ఈ "మేడే" నేడు ఆంధ్ర ప్రజానీకం ముందుంచిన బాధ్యతలేమిటి?

జపానుదాడి - దేశభక్తుల కర్తవ్యం

మన పవిత్ర మాతృభూమిపై జపాను దుండగీండ్రు అడుగు పెట్టారు. మణిపూరు సంస్థానంలో కొంతభాగాన్ని ఆక్రమించారు. దానికి ముఖ్య పట్టణమైన ఇంఫాల్ ప్రమాదంలో పడింది. దేశభక్తులందరూ జపానుదాడిని ఎదుర్కోడానికి ఐక్యమవాలి. బ్రిటిషు సామ్రాజ్యవాదులు మనకు జాతీయప్రభుత్వ మివ్వలేదని, చేతులుముడుచుకు కూర్చోడం దేశభక్తి అనిపించుకోదు. జపానుదాడికి గురియైన అస్సాం రాష్ట్రంయొక్క మాజీ కాంగ్రెసు ప్రధానమంత్రి గోపీనాథ బార్డొలాయి, అస్సాం శాసన సభాధ్యక్షుడు బసంత కుమార్‌దాస్, కాంగ్రెస్ అస్సెంబ్లీపార్టీ ఉపనాయకుడు అరుణ్ కుమార్ చందా ప్రభృతులు జపాను దుండగీండ్ర నెదుర్కోవాలని ఇచ్చిన పిలుపే ఆంధ్ర కాంగ్రెసు వాదులకు దారిచూపుతోంది. జపాను ముష్కరుల కాళ్లక్రింద నలిగిపోతున్న మణిపూరు సంస్థాన ప్రజలకు నాయకుడైన ఇరావత్‌సింగు, జపాను దుండగీండ్రకు ఒక్క గ్లాసు మంచినీళ్ళయినా ఇవ్వవద్దని తన ప్రజల కిచ్చిన సందేశమే, ఆంధ్ర ప్రజానీకానికి కూడా మార్గదర్శకం. జపాను సైన్యాలను అస్సాము భూమిపై అడుగుపెట్టనీయవద్దనీ, ఎటువంటి పరిస్థితులలోనైనా మన దేశాన్ని రక్షించుకోవడం మన కర్తవ్యమనీ, అస్సాము ప్రజలకు, మాజీమంత్రి బాబూ సంపూర్ణానందు అధ్యక్షతక్రింద సమావేశమైన సంయుక్త రాష్ట్ర కాంగ్రెసువాదుల సమావేశం ఇచ్చిన అమరసందేశాన్ని ఆంధ్ర కాంగ్రెసు వాదులు గుర్తించాలి.

ఆహార కరువు

జపానుదాడి జరుగుతున్న ఈ సమయంలో మనదేశాన్ని మునుపటికంటె తీవ్రమైన రెండవ కరువు అవహించనుంది. గత సంవత్సరం కరువులో బెంగాలులోనే 50 లక్షలమంది చనిపోయారు. ఒరిస్సాలో లెక్కలు తెలియవు. ఆంధ్రదేశంలో రాయలసీమను యెలాగో మృత్యుదేవత బారినుండి తప్పించాం. కాని రాయలసీమప్రజలు బక్కచిక్కి శల్యాలు అయారు. గత సంవత్సరం కరువునుండి తేరుకోకమునుపే ఈ సంవత్సరం మళ్ళీ కరువు ఆరంభమయింది. బెంగాలు ఒరిస్సాలలో తిండిలేక ప్రజలు చస్తున్నారు. రాయలసీమలో ధరలు విపరీతంగా పెరిగాయి. విశాఖపట్టణం జిల్లాలో తినడానికి గింజలు దొరకడంలేదు. రాయలసీమకు ఈసారి విశాఖపట్నంజిల్లాకూడ తోడయింది. ఆంధ్రదేశానికి కరువు రాకుండా చేయడానికి దేశభక్తులంతా ఐక్యమయి నడుంగట్టకపోతే, ఆంధ్ర ప్రజలను మృత్యుదేవతకు అప్పజెప్పడమవుతుంది. ఆంధ్రజాతిని విచ్ఛిన్నంచేసి, భిక్షకులజాతిగా చేయడమవుతుంది. మనముందున్న ఈ ప్రధానకర్తవ్యాన్ని వదలి, సత్యాగ్రహంచేసి జైళ్ళకు పోవడం దేశభక్తి అనిపించుకోదు. కరువునుండి మన మాతృదేశాన్ని రక్షించడానికి, కలిసి పనిచేయమని ఆంధ్ర కాంగ్రెసువాదులకు ఆంధ్రకమిటీ విజ్ఞప్తి చేస్తోంది.

నాయకుల విడుదలకోసం పనిచేయాలి

మనముందున్న రెండవ బాధ్యత కాంగ్రెసునాయకుల విడుదల. కరువునుండి దేశాన్ని కాపాడాలంటే, మన ప్రధాన జాతీయసంస్థయైన కాంగ్రెసుయొక్క నాయకులు విడుదల కావాలి. ముస్లిం ప్రజాసామాన్యంయొక్క అభిమానాన్ని చూరగొన్న రెండవ ప్రధానజాతీయసంస్థయైన ముస్లిములీగు గూడ, కాంగ్రెసుతో ఐక్యమై ఏకకంఠంతో కాంగ్రెసునాయకుల విడుదలను కోరితేనేగాని, బ్రిటిషు సామ్రాజ్యవాదులు లొంగరు. నేడుబ్రిటిషుసామ్రాజ్యవాదంపైకి కనబడుతున్నంత బలంగాలేదు. బ్రిటిషు, అమెరికన్, చైనా ప్రజల మద్దతు మనకు ఉంది. 70 లక్షల సభ్యత్వంగల బ్రిటిషు ట్రేడు యూనియన్ కాంగ్రెసు, 7 లక్షల సభ్యత్వంగల ఆస్ట్రేలియన్ ట్రేడ్‌యూనియన్‌కాంగ్రెసు, 60 లక్షల సభ్యత్వంతో అమెరికన్ కార్మికసంస్థయైన కాంగ్రెసు ఆఫ్ ఇండస్ట్రియల్ ఆర్గనైజేషన్సు, మొదలైన పెద్ద కార్మికసంస్థలన్నీ, కాంగ్రెసు నాయకులను విడుదలచెయ్యాలనీ, ఫాసిస్టువ్యతిరేక పోరాటాన్ని తీవ్రపరచే జాతీయప్రభుత్వం ఏర్పరచాలనీ తీర్మానించాయి. ఈవిధంగా బ్రిటిషు, అమెరికన్, ఆస్ట్రేలియన్ కార్మికులు వారివిధిని నెరవేర్చుతున్నారు. కాని భారతీయులే వెనుకబడి ఉన్నారు. ఐతే ప్రపంచప్రజాభిప్రాయాన్ని ఎలా అమెరీ, చర్చిల్‌లు తృణీకరించగల్గుతున్నారు? కాంగ్రెసు - లీగుల మధ్య ఐకమత్యంలేదనీ, ఏనాడు ఐకమత్యం కుదిరితే ఆనాడే జాతీయప్రభుత్వ మిస్తామనీ, ప్రకటించుతున్నారు. భారతదేశంమీద జపాను గావించిన దాడితో, కాంగ్రెసునాయకుల విడుదలసమస్య బ్రిటను, అమెరికా, చైనాలలో తిరిగి ప్రధాన సమస్య అయింది. కాంగ్రెసునాయకుల్ని విడుదలచేయాలని తీవ్రమైన ఆందోళన జరుగుతోంది. ఈ పరిస్థితులలో మన కర్తవ్యం ఏమిటి? అమెరీ, చర్చిలుల కవకాశమిచ్చిన యీ అనైక్యతను రూపుమాపాలి. ముస్లిములీగును కలుపుకొని, ఐక్యకంఠంతో కాంగ్రెసునాయకుల విడుదలనుకోరాలి. అప్పుడు బ్రిటిషు సామ్రాజ్యవాదులు ప్రపంచ ప్రజాభిప్రాయానికి తలలొగ్గాల్సి వస్తుంది.

అందుకు ఏమిచెయ్యాలి? జవహరులాల్ రాష్ట్రమైన సంయుక్త రాష్ట్ర కాంగ్రెసువాదులసమావేశం యిందుకు దారి జూపింది. వారు ఢిల్లీ వర్కింగుకమిటీ తీర్మానం ముస్లిం ప్రజలు మెజారిటీగావున్న ప్రాంతాలు విడిపోవడానికి అంగీకరించిందని చెప్పారు. ఆంధ్ర కాంగ్రెసువాదులుకూడా ముస్లింజాతుల స్వయం నిర్ణయసూత్రాన్ని స్పష్టంగా అంగీకరించి, కాంగ్రెసు-లీగు ఐక్యతకు తమవంతును నెరవేర్చాలి. కేంద్ర శాసనసభలోవచ్చిన కాంగ్రెసు–లీగు ఐక్యత దేశవ్యాపితమైన ఐక్యతగా మారాలి.

ముస్లిం సోదరులకు

ఆంధ్ర ముస్లింసోదరులారా! మీ సంస్థయైన ముస్లింలీగ్ కోరే ముస్లింజాతుల స్వయంనిర్ణయ సూత్రం న్యాయమైనదే! కాని అది కాంగ్రెసు సహాయంలేకుండా సాధింపబడదు. సామ్రాజ్యవాదులు హిందువులకు, ముస్లింలను సమంగానే పీడిస్తున్నారు. హిందువులతో మీరు ఐక్యమైతేనే గాని మీ న్యాయమైన కోర్కె ఫలించదు. ఇప్పుడిప్పుడే కాంగ్రెసు వాదులు మీ కోర్కె నంగీకరిస్తున్నారు. కాంగ్రెసు నాయకుల విడుదలకోసం, కాంగ్రెసు వాదులతో మీరు కలసి పనిచెయ్యాలి. ఆవిధంగా ముస్లింలీగ్ యెడల కాంగ్రెసు వాదుల్లో ఉన్న దురభిప్రాయాలను పోగొట్టగలుగుతారు. ముస్లిములీగుకూడ జాతీయ సంస్థ అని వారిచే అంగీకరింప జేయగల్గుతారు.

అంతేగాదు. ఇప్పుడు దేశాన్ని కరువుసమస్య ఎదుర్కొంది. బెంగాలులో 25 లక్షలకు పైగా ముస్లింలు మృత్యువు వాతబడ్డారు. ఎన్నో ముస్లిం కుటుంబాలు విచ్ఛిన్నమయినాయి. ఎందరో ముస్లిం స్త్రీలు ఉదరపోషణార్థం శీలాన్నిగూడ వదలుకోవలసి వచ్చింది. ఎంతోమంది ముస్లిం పిల్లలు తల్లి-తండ్రి లేక వీధులవెంట తిరుగుతున్నారు. బెంగాలు ముస్లింల స్థితి ఆంధ్రలోకూడా రాకుండా ఉండాలంటే, ముస్లిం సోదరులు కాంగ్రెసు వాదులతో కలసి పనిచెయ్యాలి. ఆంధ్రదేశంలో ముస్లింలు ఎక్కువగా పట్టణాలలో చిన్నచిన్న వృత్తులమీద జీవిస్తున్నారు. వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోవుటచే, పొట్టగడవక అనేకమంది అవస్థపడుతున్నారు. ఆహారసమస్యను పరిష్కరించడానికి, ముస్లింలు మిగతా ప్రజలతో కలిసి పనిచెయ్యాలి. ప్రతి ప్రజాకార్యంలోనూ కలిసిరావాలి. ప్రస్తుతం కాంగ్రెసు-లీగుల మధ్య ఐక్యత లేకపోవడాన్ని ఉపయోగించుకొని కొందరు అభివృద్ధి విరోధకులు హిందూ ప్రజాసామాన్యాన్ని మహమ్మదీయులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టచూస్తున్నారు. వారి కుటిల యత్నాన్ని మీరు ఐక్యతతోనే భగ్నంచేయగల్గుతారు.

రైతు - కూలీలకు

రైతు కూలీ సోదరులారా! ప్రజలకు ఆహారపదార్థాలను పండించేది మీరే. అన్నదాతలుగా మీ గౌరవప్రదమైన స్థానాన్ని, బాధ్యతనుగుర్తించండి. మనదేశాన్ని ప్రస్తుత కరువునుండి కాపాడేబాధ్యత మీమీద చాలావుంది. అందుకు అధికపంటలు పండించాలి. ఎక్కువ ఎరువులువేయండి. మంచి విత్తనాలునాటండి. మురుగుకాల్వలు, పంటకాల్వలు, చెరువులు మరమ్మతు చేయండి. ఇందుకు ప్రభుత్వోద్యోగులు, జమీందార్లు ఇతర ప్రజా వ్యతిరేకులు పెట్టే అటంకాలను ప్రజాబలంతో ఓడించండి. అధికాహారోత్పత్తిని జయప్రదంగా సాగించండి.

అధికాహారోత్పత్తి జయప్రదంగా సాగాలంటే, రైతు-కూలీ సామరస్యం అవుసరం. మన గ్రామ సౌభాగ్యానికి ఇదే పునాది. ఈఐక్యతను సాధించేభారం ప్రధానంగా రైతు సోదరులమీద ఉంది. కూలీలకు న్యాయమైన కూలి ఇయ్యాలి. వారిని తమతో సమానగౌరవంతో చూడాలి. వారికి పనిలేనికాలంలో ధాన్యపు పండులు వసూలుజేసి, వడ్డీలేకుండా అప్పులియ్యాలి. అమానుషమైన నాముపద్ధతివి మానివెయ్యాలి. కూలీలుకూడా పనిని చక్కగాచెయ్యాలి.

రైతు సోదరులారా! కరువు సమస్యను పరిష్కరించడానికి అధిక పంటలు పండిస్తేనే సరిపోదు. మన దేశంలో ప్రజలకు బొటాబొటీగా సరిపోయే ఆహారపంటలు పండుతున్నవి. అయినప్పటికీ ఈ కరువురావడానికి ముఖ్యకారణం దురాశాపరులైన పెద్ద వర్తకులు, వీటిని కొని దాచి వుంచి, ధరలు పెంచి, విపరీతలాభాలు సంపాదించడం. మీకు అవుసరమైన ధాన్యం వుంచుకొని మిగతా దానిని సాధ్యమైనంతవరకు ప్రభుత్వానికే అమ్మండి. ఎక్కువధర వచ్చునని ఆశపెట్టినా వర్తకులకు అమ్మవద్దు. ధాన్యానికి కొంచెం యెక్కువ ధర వచ్చిందని ఆశపడితే, ధాన్యం అంతా తిండి దొంగలచేతుల్లోకి పోవడం, వారు విపరీతంగా ధరలు పెంచడం, చివరకు కరువురావడం (తరువాయి 12 పేజీ)

బుధవారం ప్రజాశక్తి 26-4-44

కానూరు - పెండ్యాల ప్రాజెక్టులను నిర్మించాలి

మద్రాసు ప్రభుత్వం అధికపంటల ఉత్పత్తి పాలసీ ననుసరించి కానూరు, పెండ్యాల ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా రైతులు ఆందోళన చేశారు. ఈ రెండుస్కీములక్రింద కొవ్వూరు తాలూకాలో 11,000 ఎకరాల భూమిలో వరిధాన్యం పండించవచ్చును. అనగా షుమారు 1,72,500 బస్తాల ధాన్యం అదనంగా పండుతుంది. దేశంలో కరువు తాండవమాడుతున్న యీ రోజులలో యిలాంటి స్కీములను వెంటనే అమలు జరుపడం ఎంతో అవుసరం. అందుచేతనే రైతాంగం తమసంఘాలద్వారా యీ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఒత్తిడి చేశారు.

ప్రభుత్వంకూడ ఈఅవుసరాన్ని గుర్తించింది. నిర్మాణానికిఎస్టిమేట్లు వేసింది. ఒకస్పెషల్ సబ్‌డివిజన్‌ను ఏర్పాటుచేసింది. కానూరు ప్రాజెక్టుక్రింద 3,500 ఎకరాలు, పెండ్యాల ప్రాజెక్టుక్రింద 7500 ఎకరాలు సాగుఅవుతాయని అంచనా వేయబడింది. రైతులు ఎకరానికి 25/-రూ. నజరానా యివ్వాలనీ, కొంత ఆదాయం వస్తుందనీ, మిగతా ఖర్చుపెట్టిన పెట్టుబడిపై నీటితీరువాద్వారా నూటికి 4 చొప్పున వడ్డీ గిడుతుందని ప్రభుత్వ అంచనాలే తెలుపుతున్నాయి.

కాని ఆకస్మికంగా ప్రభుత్వం యీ ప్రయత్నాలను విరమించిందని, అందుచే రైతులలో అలజడిగా వుందని జిల్లా రైతుసంఘకార్యదర్శి అన్నె వెంకటేశ్వర్రావు గారు తెలుపుతున్నారు. రైతులు పొగాకు పంటవల్ల ఎక్కువ లాభం పొందుటవల్ల యీ స్కీములకు సుముఖత చూపుటలేదని, అందుచే నిర్మాణప్రయత్నం విరమించబడిందనీ ప్రభుత్వోద్యోగులు సాకుచెబుతున్నారట. ఇది సబబైన కారణంకాదు. ఆప్రాంతాలరైతులలో నూటికి 4 గురు మాత్రమే పొగాకుపంటపై ఆధారపడివున్నారు. తక్కిన రైతులంతా యీ స్కీములను ఆహ్వానిస్తున్నారు. నజరానా చెల్లించడానికి కూడా సిద్ధంగా వున్నారు. అందుచే నిర్మాణ కార్యాలను కొనసాగించాలని కార్యదర్శిగారు ప్రభుత్వాన్ని హెచ్చరించుతున్నారు. ఈ విషయమై కానూరు ప్రాజెక్టు రైతుల తరపున మద్రాసు ప్రభుత్వం వద్దకు కొద్దిరోజులలో రాయబారం వెళ్ళబోతున్నారని కూడా తెలుస్తోంది.

మద్రాసు ప్రభుత్వం నేటి పరిస్థితులలో ఆహారధాన్యాలను ఎక్కువపండించడం యొక్క ప్రాముఖ్యతను గుర్తించాలి. కొలదిమంది పొగాకుపండించే భూస్వాముల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని యీ ప్రాజక్టుల నిర్మాణం ఆపుచేయరాదు. ఈ కరువుకాలంలో 11 వెల ఎకరాలు అదనంగా వరిసాగు, 172,500 బస్తాల ధాన్యపుపంట సామాన్య విషయంకాదు. అందుచే జిల్లా రైతుసంఘ రాయబారాన్ని గుర్తించి, మద్రాసు ప్రభుత్వం వెంటనే కానూరు, పెండ్యాల ప్రాజెక్టుల నిర్మాణానికి పూనుకోవాలని కోరుతున్నాం.

"అన్నిటికంటె మన మాతృదేశం మనకు ప్రియమైనది"

— ఎ. కె. చాందా

శ్రీ ఎ. కె. చాందా అస్సాం రాష్ట్ర కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీకి డిప్యూటీ లీడర్. ఆయన యీ క్రిందివిధంగా దేశీయులందరినీ సంబోధిస్తున్నారు:

" అన్నింటికంటె మన మాతృదేశం మనకు ప్రియమైనదదే విషయాన్ని మరచిపోకూడదు. మనలో మనకు విశ్వాసం ఉండాలి. నేటి దేశపరిస్థితుల్ని స్పష్టంగా అర్థంచేసుకొని, దేశమాత మనందరిపై ఉంచిన బాధ్యతను ఏకాగ్రతతో నిర్వహించవలసియుంది. కాంగ్రెసు నాయకులు జైళ్ళలో నిర్బంధించబడి యిప్పటికి 2 సంవత్సరాలు కావస్తోంది. అందువల్ల ప్రజలు చుక్కానిలేని పడవవలె ఐపోయారు. వారిని సరియైనమార్గంలో నడుపవలసిన, వారి విశ్వాసాన్ని చూరగొన్న, జాతీయ నాయకులు దూరంఅయారు. ప్రభుత్వ యుద్ధకృషిని వారు ఆటంక పరిచారని యెవరూ ఆరోపింప జాలరు. కాబట్టి, ప్రభుత్వం యీ సమయంలో నైనా తనమొండి పట్టుదలను విడనాడ వలసియుంది.

" ఏదేశానికైనా మహోపద్రవం సంభవించినప్పుడు, సాధారణంగా అందరూ కలుస్తారు. కాబట్టి, అందలికీ సమానమైన ఆశయంకొరకు కలిసి పనిచేసే యీ అవకాశాన్ని జారవిడువవద్దు, ఎవరూ జారవిడువరనే విశ్వాసం నాకుంది. నేటి పరిస్థితులలో ఇదొక్కటే అందరి ఆశయం."

కానూరు-పెండ్యాల స్కీములకై ప్రజా ఆందోళన

కానూరు — పెండ్యాల స్కీములను అమలు జరుపుటద్వారా 20 గ్రామాలకు చెందిన 11000 ఎకరములలో 1,72,500 బస్తాలు పండించుటకు వీలుంది. రైతుసంఘం, రైతులు, తీవ్రాందోళన చేయుట, ప్రభుత్వం కూడా దీనిని గమనించి స్పెషల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును ఈస్కీములను అమలు జరిపించు నిమిత్తం ఎర్పరుచుటయు, జరిగింది. ఇట్టి స్కీమును యిపుడు ఆకస్మికంగా ఆపుచేయుటలో సరియగు కారణం ఏమీ కనుపించదు. "వ్యాపార పంటల పట్ల రైతులు శ్రద్ధకలిగి వున్నారని" రెవిన్యూ డిపార్టుమెంటువారు ప్రభుత్వమునకు రిపోర్టు చేసినట్లు తెలుస్తోంది. ఇది కేవలం సత్యవిరుద్ధము. 1943 అక్టోబరు, నవంబరు, 1944 ఫిబ్రవరి మాసములలో అర్జీలు యిచ్చారు. 1943 సెప్టెంబరులో నెట్టిపేట ఎగ్జిక్యూటివ్ యింజనీరుగారి వద్దకు రాయబారం వెళ్ళారు. 13—11—43 న నెట్టిపేటలో జరిగిన యిర్రిగేషన్ కాన్ఫరెన్సులో 17 గ్రామాలనుండి 100 మంది ప్రతినిధులు తీర్మానాలు చేశారు. 16—11—43 న విష్ణేశ్వరంలో చీఫ్ యింజనీరువద్దకు 20 మంది ప్రతినిధులతోను రాయబారం (జిల్లా రైతుసంఘాధ్యక్షుల అధ్యక్షతను) వెళ్ళారు. అధికాహారోత్పత్తికే తాము సిద్ధంగవున్నామని వీటన్నిటిద్వారా తెలియపర్చారు. పెండ్యాల పంపింగుస్కీము క్రింద 8 రూపాయలు నీటితీరువా యిచ్చుటకు కూడా కొందరు రైతులు అపుడే హామీ యిచ్చారు. నజరానా మొత్తం ముందుగ యిస్తామనికూడాఅన్నారు.

స్కీములకొరకై రైతులు యింత ఆతురతను చూపుతుంటే, వ్యాపార పంటలపై శ్రద్ధగలిగి వున్నారనడం హాస్యాస్పదంగా వుంది. ఈస్కీమును అమలుకు తేవడంద్వారా ఐ. ఎల్. టి. డి. కంపెనీవారికి మాత్రం పుగాకు సప్లయిగాక నష్టం వస్తుంది. సదరు కంపెనీ పట్ల పక్షపాతంవహించి ప్రభుత్వాధికారులు సత్యవిరుద్ధమైన రిపోర్టులు వ్రాసియుండాలి.

దేశం కరువుతో అల్లాడుతుంటే ఈస్కీములను కుంటిసాకులతో ఆపుచేయుటసరిగాదు. నిజంగ రైతులు వ్యాపార పంటలపట్ల శ్రద్ధ చూపుతున్నారో లేదో గమనించాలంటే, మే 1 వ తేదీ కానూరులో జరుగు 'కానూరు ప్రాజెక్టు రైతుల సభకు' ప్రభుత్వాధికారులు వచ్చి తెల్సుకోమని కోరుతున్నాను.

నిజపరిస్థితులను గుర్తించి ప్రభుత్వం ఈస్కీములను అమలుజరిపించగోర్తాను.

జిల్లాలోని ప్రజాసేవకులు, ఎం.ఎల్.ఏ.లు అంతా ఈస్కీములను అమలు జరిపించుటకు కృషిచేయగోర్తాను.

ఇట్లు,
అన్నే వెంకటేశ్వరరావు,
ప. గోదావరిజిల్లా రైతుసంఘ ప్రధాన కార్యదర్శి.

★

కానూరు ప్రాజెక్టు రైతుల కమిటీ సమావేశం

పై కమిటీ 13—4—44 వ తేదీని శ్రీమత్కందాళం శఠగోపాచార్యులుగారి అధ్యక్షతకింద కానూరులో సమావేశమై యీ క్రింది విధంగా తీర్మానించింది.

"కానూరు - పెండ్యాల స్కీములక్రింద రైతులు ముందుగానే నజరానా చెల్లించుటకు అంగీకరించి, అర్జీలు పంపుకున్నప్పటికీ, అధికాహారోత్పత్తికి అంతా యీ విధంగా పూనుకొన్నప్పటికీ, యీ స్కీమును ప్రభుత్వం ఆపు చేయడం విస్మయము కలిగిస్తోంది. వ్యాపారపు పంటలను పండించుటలో రైతులు శ్రద్ధకలిగి యున్నారనిన్ని, స్కీమును అమలుచేయుట ప్రభుత్వమునకు నష్టదాయకమనిన్నీ, స్థానిక ప్రభుత్వాధికారులు ప్రభుత్వమునకు రికమెండు చేసినట్లు తెలుస్తోంది. ఇది కేవలం సత్యదూరం. అర్జీలుయిచ్చి, రాయబారాలువెళ్ళి, రైతులంతా ఆహారపంటలను పండిస్తామనిహామీ యిస్తూంటే రైతులు వ్యాపారపు పంటలను పండించుటలో శ్రద్ధ కలిగి యున్నారనుట దుస్సాహసము. ఈస్కీము వర్తించు గ్రామములలో 100 కి 4 లేక 5 గురు రైతులు తప్ప మిగతావారు పొగాకును పండించుట లేదు. రైతులకులేని ఉద్దేశములను ఆరోపించుట అధికాహారోత్పత్తి స్కీముకు ద్రోహం చేయదలచిన వారు మాత్రమే చేయగలరు. ఐ. ఎల్. టి. డి. కంపెనీవారు తప్ప రైతులెవ్వరూ వ్యాపారపుపంటలపట్ల శ్రద్ధకలగిలేరు."

"ప్రభుత్వం అధికాహారోత్పత్తి కంటే, దేశరక్షణకంటేకూడా ఐ.ఎల్.టి.డి కంపెనీ వారి వ్యాపారమును నిలబెట్టుటకు ప్రాధాన్యత యిస్తేతప్ప, ఈ స్కీమును ఆపుచేయుటకు న్యాయమగు కారణము ఏదీ కనుపించదు. బంజర్లుకూడా సాగుచేసి, దేశరక్షణకై అధిక పంటలు బండించాలన్న ప్రభుత్వం, అధికాహారోత్పత్తికి 60000 బస్తాలు పండుటకు అస్కారమున్న స్కీమును ఆపుచేయుట శోచనీయము. రాష్ట్ర ఆహారకమిటీ, మదరాసు ప్రభుత్వము, దీని ప్రాముఖ్యతను గుర్తించి నిజపరిస్థితులను తిరిగి విచారించి, ఈ స్కీమును వెంటనే ఆచరణకు తీసుకొని రావలసినదిగా ఈసమావేశము కోరుచున్నది.

" దీనితోపాటు పెండ్యాలస్కీమునుకూడా ఆచరణలోనికి తెచ్చుచో, 7500 ఎకరములు (ప్రభుత్వ లెక్కల ప్రకారం) సేద్యమునకు వచ్చును. అంటే 1,12500 బస్తాలు పండును. గాన రెండు స్కీములను వెంటనే అమలుపరపించి 172500 బస్తాల అధిక పంటకు సావకాశమును కల్పించమని ప్రభుత్వమును ఈ సమావేశము కోరుచున్నది.

"కానూరు-పెండ్యాల స్కీములను అమలు జరిపించమని, రైతులంతా ఆహారపంటలు పండించుటకు సిద్ధముగానున్నామని, గ్రామములలో సభలు జరిపించుట, తీర్మానములు చేయించుట, టెలిగ్రాములు యిచ్చుట, పంచాయితీబోర్డు అధ్యక్షులద్వారాను, గ్రామాధికారులద్వారాను ఈ స్కీములను బలపరుస్తూ ప్రభుత్వమునకు స్టేటుమెంట్లు యిప్పించుటకు ఈ సమావేశంవారు తీర్మానించుచున్నారు. మే 1 వ తేదీని అన్ని గ్రామములనుండి రైతులంతా కానూరులో జరుగు కానూరు స్కీము రైతుమహాసభకు వచ్చునట్లు చేయుటకు ఈ కమిటీ సభ్యులంతా పనిచేయుటకు నిశ్చయించుచున్నారు."

మన రాజకీయాలు

బెంగాల్ బాధితుల సహాయార్థం మెడికల్ విద్యార్థుల దీక్ష

బెంగాల్‌లో కరువువల్ల, అంటురోగాలవల్ల, బాధపడే ప్రజలకు సహాయం చేయడానికి మద్రాసు మెడికల్ కాలేజీలలో విద్యనభ్యసించే 19గ్గురు సీనియర్ మెడికల్ విద్యార్థులు ఒకదళంగా యేర్పడ్డారు. బెంగాల్‌లో వారు 6 వారాలుంటారు. డాక్టర్ బి. సి. రాయి అధ్యక్షత క్రింద పనిచేసే 'వైద్యసహాయక సంఘాల ఐక్యకమిటీ' యాజమాన్యాన వీరు వైద్యసహాయం చేస్తారు. ఈ 13 గ్గురిలో 10 మంది "మద్రాసు విద్యార్థులసంస్థ"కు చెందినవారు, 3గ్గురు "క్రైస్తవవిద్యార్థిఉద్యమా"నికి చెందినవారు.

వీరికి వీడ్కోలు యిచ్చేటందుకు మొన్న 19 వ తేదీని మద్రాసులో ఒకపెద్ద బహిరంగ సభ జరిగింది. డాక్టరు తిరుమూర్తి సభ కధ్యక్షతవహించారు.

"మద్రాసు విద్యార్థులసంస్థ" తరపున పరమేశ్వరన్ ఉపన్యసిస్తూ, కాంగ్రెసు నాయకులీరోజున బయటఉంటే, బెంగాల్ బాధితుల సహాయార్థం దేశీయులందరినీ సమీకరించియుండే వారనిచెప్పాడు. ఈ భావమేమద్రాసు మెడికల్ విద్యార్థుల్ని ఉత్సాహపరచడానికి కారణమన్నాడు.

శ్రీ టి. టి. కృష్ణమాచారి, ఎం. ఎల్. ఎ., దేశమంతటా కరువు వున్నప్పటికీ, బెంగాల్‌కరువుసమస్యను పరిష్కరించకపోతే యితర రాష్ట్రాల సమస్య పూర్తిగా పరిష్కరించ బడదని పలికారు.

డాక్టరు పి. సుబ్బరాయన్ యిలా ఉపన్యసించారు: " నేటి యుద్ధం సర్వవ్యాపితమైనట్టిది. యుద్ధరంగం ఎంత వగడ్బందీగా ఉండాలో, ప్రజల మనో నిబ్బరంకూడా అంత చెక్కుచెదరకుండా ఉండాలి. కాబట్టి, కరువు, అంటురోగాలు, దేశంలో వ్యాపించకుండా ప్రభుత్వం తగు చర్య తీసుకోవలసియుంది."

జనరల్ హాస్పిటల్‌లో ఎడిషనల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తూన్న లెఫ్టినెంట్ స్కిన్నర్ లేచి, మెడికల్ దళాన్ని ప్రశంసిస్తూ మాట్లాడారు. దేశంలో వాతావరణం ఎంత అంధకార బంధురమైయున్నా, బెంగాల్ ప్రజల్ని రక్షించేటందుకు దేశీయులందరూ ఐక్యతతో ముందుకు రావడం సంతోషించవలసిన విషయం అన్నారు. మద్రాసు యువకులు ఈవిధంగా తమ బెంగాల్ సోదరుల సహాయార్థమై వెళ్ళడం ఎంతో ఉత్సాహాన్ని ఇస్తోందన్నారు.

కలనల్ కె. ఆర్. కె. అయ్యంగార్, ఐ. ఎం. ఎస్. తానుకొద్ది రోజుల్లో రిటైర్ అయిన వెంటనే రెండవ దళంలోచేరి బెంగాలుకు వెళ్తానని తెలియ జేశారు.

మద్రాసు నగరంలోని వివిధకార్మిక సంస్థల తరఫున, విద్యార్థి సంస్థల తరఫున, కమ్యూనిస్టుపార్టీ తరఫున, కూడా పలువురు ఉపన్యసించారు. మద్రాసుమేయరు, మాజీకాంగ్రెసు మంత్రివర్గంలో ఒకరైన డాక్టరు రాజన్, లెఫ్టినెంట్ కలనల్ పండాలె మొదలైన ప్రముఖులు సందేశాలు పంపించారు; డాక్టరు తిరుమూర్తి మెడికల్ విద్యార్థుల్ని సంబోధిస్తూ తమ అంత్యోపన్యాసంలో యిలా చెప్పారు: "మీ ఉత్సాహానికి, మీకార్యదీక్షకు, అభినందిస్తున్నాను. నేటి కాటక పరిస్థితులలో, ముఖ్యంగా జపాన్‌దాడివల్ల యేర్పడిన ప్రమాద పరిస్థితులలో, భారతీయులందరు తమ భేదాభిప్రాయాలను కట్టిబెట్టి, మన మాతృభూమిని రక్షించుకొంటూ స్వాతంత్ర్యాన్ని సంపాదించుకొనేటందుకు ముందుకు వస్తారని ఆశిస్తున్నాను"

మహాత్మునికి ఆరోగ్యం

ఈ నెల మూడవవారంలో గాంధీజీ మలేరియావల్ల 3 రోజులు బాధపడ్డారు. క్రమంగా జ్వరంతగ్గి, యిప్పుడు ఆరోగ్యాన్ని కోలకుంటున్నారు అని ప్రభుత్వ ప్రకటన.

పార్లమెంటులో అమెరీ వాగుడు

మొన్న 18 వ తేదీని బ్రిటిష్ పార్లమెంటులో అమెరీ (ఇండియా కార్యదర్శి) తిరిగి ప్రత్యక్షమయాడు. మంత్రి వర్గాలులేని 5 రాష్ట్రాలలోను నిరంకుశ పరిపాలనను మరో సంవత్సరంవరకూ పొడిగించాలని తీర్మానం ప్రతిపాదించాడు. ఆగస్టు (1942) అల్లరులను పురిగొల్పినది కాంగ్రెసేనంటూ వంతపాడాడు. ఒకవైపు కాంగ్రెసునాయకుల్ని జైళ్ళలో నిర్బంధించి, మరోవైపు వివిధరాజకీయ పార్టీలమధ్య రాజీ జరుగుటకుతాను సర్వ ప్రయత్నాలు చేశానని బుకాయించాడు.

అమెరీ ఉపన్యాసం పార్లమెంటుసభ్యులలో తీవ్రమైన అసంతృప్తిని కలిగించింది. పెథిక్ లారెన్స్ వెంటనేలేచి, ఇంతటి పాడు ఉపన్యాసాన్ని వినవలసివచ్చినందుకు తన్నుతాను నిందించుకున్నాడు. అమెరీ ఇండియా కార్యదర్శి పదవిలో ఉండుటకు అనర్హుడని తెలియజేశాడు. రాష్ట్రాలలో ప్రజాప్రతినిధులులేకపోవడానికి కారణం కాంగ్రెసు నాయకులేనని అమెరీ చెప్పినప్పుడు మిస్టర్ కవ్ "అది వట్టి అబద్ధం" అన్నాడు. సోరెన్సన్, గ్రాహం వైట్, హార్వే మొదలయిన ప్రముఖులు కూడా అమెరీని ఖండించారు.

ఈవిధంగా పార్లమెంటులో బ్రిటిష్‌ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే సభ్యులంతా అమెరీని వ్యతిరేకిస్తూంటే, "ప్రముఖులైన సభ్యులెవరూ నోరైనా విప్పియుండలేదు" అని 'ఆంధ్రపత్రిక' వ్యాఖ్యానించడం శోచనీయం.

కంభంపాటి సత్యనారాయణ

యు. పి. నాయకులు ★ ★ దేశానికిస్తూన్న పిలుపు

ఈ నెల 16, 17 తేదీలలో యు. పి. రాష్ట్ర కాంగ్రెసునాయకులు లక్నోలో బాబూ సంపూర్ణానంద్ అధ్యక్షతక్రింద సమావేశమై, ప్రస్తుత పరిస్థితుల్ని సాకల్యంగా చర్చించి, యీక్రింది తీర్మానాన్ని గావించారు:

"జపాన్‌సైన్యాలు అస్సాంలో ప్రవేశించడంవల్ల యేర్పడిన పరిస్థితులకు యీసభవారు ఆందోళనను వెలిబుచ్చుతున్నారు. ఇదివరకే కరువురాక్షసికి గురియై, ఇప్పుడు శత్రుదాడివల్ల అనేకబాధలుపడుతూన్న అస్సాం ప్రజలపట్ల సానుభూతిని ప్రకటిస్తున్నారు. దేశానికి ఫాసిస్టు దురాక్రమణయొక్క ప్రమాదం ఇంకా తప్పిపోలేదనడానికి యీ దాడి ఒక నిదర్శనం. సామ్రాజ్యవాదంపట్ల కాంగ్రెసు ప్రకటించిన వైఖరిని యీ సభవారు బలపరుస్తూ, ఎన్ని ఆటంకాలున్నప్పటికీ అస్సాం ప్రజలు తమ శక్తులనన్నిటినిఒడ్డి యీ దాడిని ప్రతిఘటిస్తారని నమ్ముతున్నాం. ఎవరు దురాక్రమణ చేసినప్పటికీ, దాన్ని కాంగ్రెసు వ్యతిరేకిస్తుంది. ఎట్టి పరిస్థితులలోనైనాసరే, మన దేశాన్ని మనం రక్షించుకోవడమే సరియైన మార్గమని కాంగ్రెసు చెబుతోంది."

తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ డాక్టరు కట్జూ యిలా ఉపన్యసించారు. జపాన్ ప్రమాదం అంతలేగాని రోజుల్లోనే కాంగ్రెసునాయకులు విదేశీదురాక్రమణకు వ్యతిరేకంగా తమదృక్పథాన్ని స్పష్టంచేశారు. కాంగ్రెసు దృక్పథం ఎప్పుడూ ఇదే; ఇప్పటికికూడా యిదే. తరువాత క్రిప్సు మనదేశానికి వచ్చినప్పుడు జపాన్ ప్రమాదం హెచ్చింది. అయినప్పటికీ గాంధీజీ, కాంగ్రెసు వర్కింగ్‌కమిటీ, కూడా మనదేశాన్ని మనం రక్షించుకొని తీరాలని ఘంటాపథంగా తెలియజేశారు. కాబట్టి, విదేశీదండయాత్రను ప్రజలు ప్రతిఘటించి తీరాలి. విదేశాలనుండి ఎవరో వస్తారనీ, మనకు స్వరాజ్యంతెచ్చి యిస్తారనీ ఆశలు పెట్టుకోకూడదు. భారతదేశాన్ని భారతీయులే రక్షించుకోవాలి. మొదటినుంచీ కాంగ్రెసు ప్రకటిస్తూవచ్చిన దృక్పథాన్నే యిప్పుడు కూడా మనం కలిగియుండాలి.

బాబు సంపూర్ణానంద్ తీర్మానాన్ని బలపరుస్తూ, యీ వైఖరినే వెలిబుచ్చారు.

అస్త్రసన్యాసం

త్వరలోనే కృష్ణా, గుంటూరు జిల్లా బోర్డులకు మద్రాసు ప్రభుత్వం నామినేషన్లు చేయబోతూన్నట్లు వార్తలు వస్తున్నాయి. నిజమైన ప్రజాప్రతినిధులకు స్థానిక సంస్థలలో స్థానం లేకుండాచేసి, తమ జోహుకుం వాలాలను పీఠం యెక్కించి, తోలుబొమ్మలాటతో సంతృప్తిపడే ప్రభుత్వ విధానాన్ని యే ప్రజాస్వామ్యవాది సమర్థించడు.

గుజరాత్‌లో ఈమధ్య జిల్లాబోర్డుఎన్నికలు, మ్యునిసిపల్ ఎన్నికలు జరిగాయి. కాంగ్రెసు అభ్యర్థులకేఅత్యధికమైన మెజారిటీ వచ్చింది. ఐనప్పటికీ, వారుస్థానికసంస్థల నిర్వహణలో పాల్గొనుటకు నిరాకరించారు. ఇందుకు కారణంగా, జాతీయప్రభుత్వం లేనిదే అవి సక్రమంగాను, సంపూర్తిగాను, పనిచేయవని తెలియజేశారు. అవకాశాలు తక్కువేఉన్నప్పటికీ, ప్రభుత్వ గులాముల కంటె తామే కొంచెమైనా స్థానికసంస్థలలో ఉండి ప్రజలకు సేవచేయవచ్చుననే విషయాన్ని వీరు గుర్తించలేదు. ఫలితం? తిరిగి మన కృష్ణా, గుంటూరు జిల్లాబోర్డులలో మాదిరి అక్కడ కూడా నామినేషన్ల "ఉత్సవాలు" జరుగుతాయి.

అస్తమయం

మాజీ కాంగ్రెసు అధ్యక్షులైన శ్రీ సి. విజయరాఘవాచారియర్ యీ నెల 19 వ తేదీని కాలధర్మం చేశారు. చనిపోయేటప్పటికి వీరి వయస్సు 92.

వార్తలు - విశేషాలు

మొన్న 14 వ తేదీని బొంబాయి రేవులో ఒకఓడనిప్పంటుకొని, మందుగుండు సామానంతా పేలడంవల్ల, అక్కడికి సమీపంలోఉన్న కట్టడాలు, గిడ్డంగులు, నేలమట్టం అయాయి. 100 కోట్ల రూపాయలు విలువగల ఆస్తి నష్టమైంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం 347 గురు చనిపోయారు; 1806 గురికి గాయాలు తగిలాయి (19 వ తేదీ లెక్కలు), అనేకవేలమంది ప్రజలకు తల దాచుకునేటందుకు యిళ్లులేకపోయాయి. 55 వేల టన్నుల ఆహారపదార్థాలు భస్మం అయాయి. అధికార, అనధికార, వర్గాలు బాధితులకు సహాయం చేస్తున్నారు. గాయపడ్డవారికి చికిత్సలుచేస్తున్నారు. సింధురాష్ట్రం నుంచి 10 వేల టన్నుల బియ్యం, పంజాబు నుంచి 20 వేల టన్నుల గోధుమలు, బొంబాయికి పంపబడుతున్నాయి.

• • •

1943 మే నెలలో దక్షిణాఫ్రికాలో భారతీయులు తమకు ప్రత్యేకించబడిన ప్రదేశాలలో తప్ప మరెక్కడా ఆస్తిని కొనరాదంటూ ఒక శాసనం చేయబడింది. దీన్ని వ్యతిరేకిస్తూ మనదేశంలోని అన్ని రాజకీయపార్టీలు దక్షిణాఫ్రికా ప్రభుత్వ చర్యను ఖండించాయి. అక్కడి కార్మికసంస్థలు, భారతీయ జాతీయ సంస్థలు, కూడా ఆందోళన ప్రారంభించాయి. ఇండియా ప్రభుత్వంకూడా దక్షిణాఫ్రికా ప్రభుత్వచర్యను నిరసించింది. ఈ ప్రజా వెల్లువకు తట్టుకోలేక, దక్షిణాఫ్రికా ప్రభుత్వం కొత్తచట్టాన్ని మొన్న 18 వ తేదీని రద్దు చేయవలసివచ్చింది.

• • •

1939 లో మద్రాసు ప్రభుత్వం జారీచేసిన పొగాకుచట్టం ఏప్రిల్ 1 వ తేదీ లగాయతు రద్దుచేయబడింది. (మిగతా 11 వ పేజీలో)

కొత్తగూడెం బొగ్గుగనులలో దారుణ పరిస్థితులు

— మా విలేఖరి

ప్రజల కవసరమైన ఆహారపదార్థాలన్నీ రైళ్ళలో రవాణా చేయబడతాయి. బట్టలకేన్న రైళ్ళలో వస్తాయి. కట్టెలు, వగైరా జీవితావసరవస్తువులన్నీ రైళ్ళలోనే పంపుతారు. అస్సాం సరిహద్దులలో తమ ప్రాణాలొడ్డి, దేశాన్ని రక్షిస్తూన్న సైనికులకు ఆయుధసామగ్రికూడా రైళ్ళలోనే వెళ్తుంది.

ఇట్టి రైళ్ళు వేగంగా నడవాలంటే, బొగ్గు అవసరం. బొగ్గులేక పోతే ఇంజన్ నడవదు.

ఇంతేకాదు, బట్టల మిల్లులు నిరంతరం పనిచేయాలంటే, విరివిగా వాటికి బొగ్గు సప్లయికావాలి.

వంటకు మనం కట్టెలు యెలా ఉపయోగిస్తామో, అలాగే ఉత్తరహిందుస్థాన్‌లో బొగ్గును ఉపయోగిస్తారు.

కాబట్టి ప్రజల తిండికరువును, బట్టకరువును నిర్మూలించడంలో బొగ్గుసప్లయి ఎంతో ప్రధానమైన పాత్రను నిర్వహిస్తోంది. దేశరక్షణకుకూడా బొగ్గుచాలా ముఖ్యం.

ఇంత ముఖ్యమైన బొగ్గు నేటిపరిస్థితులలో మామూలుకంటె అనేకరెట్లు యెక్కువఉత్పత్తి కావలసియుండగా, యజమానులు కార్మికులపట్ల అవలంబించేవిధానంవల్ల ఉత్పత్తికుంటువడుతోంది. ఈ వ్యాసం కొత్తగూడెం (నైజాం) బొగ్గుగనులలో పనిచేసే కార్మికుల స్థితిగతుల్ని తెలియజేస్తుంది.

★

కొత్తగూడెం బొగ్గుగనులు సింగరేణి బొగ్గుగనుల కంపెనీ యాజమాన్యాన నడుపబడుచున్నవి. దీనిమీద పెట్టుబడి 1 కోటి రూపాయలు. ఈ బొగ్గు మన దక్షిణదేశానికంతకూ ప్రశస్తమైనది. దీనివల్ల వచ్చిన కొన్ని కోట్ల రూపాయలు వడ్డీక్రింద, డివిడెండ్లక్రింద, పంచిపెట్టబడ్డాయి. పెట్టుబడి పెట్టిన మూలధనం యేనాడో వచ్చేసింది; ఇప్పుడు గనులు లాభంమీద నడుస్తున్నాయి.

కార్మికుల స్థితిగతులు

భూగర్భంలో పనిచేసే కార్మికులు మొత్తం 4000 మంది ఉంటారు. భూమిపై పనిచేసేవారు 2000. వీరు గాక, షుమారు 1000 మంది ఇండియా ప్రభుత్వంచే పంపబడ్డ కార్మికులున్నారు. 1944 జనవరికి పూర్వం వీరందరికీ సగటున నెలకు రు. 12 మొదలు రు. 15వరకు మాత్రమే జీతం ఉండేది. కాని, ఆంధ్రమహాసభ వారు ఇండియా ప్రభుత్వానికి పంపిన మెమోరాండం ఫలితంగా, 100 కి 50 చొప్పున అధిక ధరల అలవెన్సు యివ్వబడుతూంది కార్మికుల జీవిత పరిమాణం 100 కి 300 చొప్పున పెరిగిన యీ రోజుల్లో, 100 కి 50 అలవెన్సు సరిపోవుటలేదు. అందువల్ల కార్మికులు విరివిగా వచ్చి గనులలో పనిచేయడంలేదు.

ఉద్యోగస్తులు, గుమాస్తాలు, వర్కుషాపు కార్మికులు, మినహా మిగతావారంతా గుడిసెల్లోనే కాపురం ఉంటున్నారు. ఇప్పుడా గుడిసెలు చెదలుపట్టి, వర్షాకాలంలో నిలువనీడ లేకుండా నీళ్ళతో నిండుతాయి. కూలీలైనులలో షుమారు 1000 మంది కార్మికులు నివసిస్తున్నారు. కాని, వారందరికీ ఒకేఒక చిన్న మరుగుదొడ్డి.

గనులలో నీళ్లే మంచినీళ్లు

నీళ్ల పంపుల స్థితి మరీ అధ్వానంగా ఉంది. షుమారు 100 గుడిసెల కొక పంపు చొప్పున యేర్పాటుచేశారు. అందువల్ల, నీటికై జరిగే వరపిడివల్ల కుండలు బద్దలు కావడం, దెబ్బలాటలు జరగడం, పరిపాటయింది. కార్మికులసంఖ్య ఎక్కువ కావడంవల్ల కొత్తదావులుతవ్వి, వాటినుండి నీటిని పంపుచేయడానికిబదులు బొగ్గుగనులలోని నీటిని (Mineral water) కాగేనీళ్లగాపంపు చేస్తున్నారు. అందువల్ల కొందరు కార్మికులు చర్మరోగాలతోను, అజీర్ణం, గజ్జి మొదలయిన వ్యాధులతోను, బాధపడుతున్నారు.

ఊరిలో పబ్లికులైట్లు లేనేలేవు. అందువల్ల రాత్రిపూట పనులకువెళ్లే కార్మికులకు, తిరిగివచ్చేవారికి, బహు యిబ్బందిగాఉంది. తేళ్లు, పాములు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి.

ఉద్యోగులకు "మామూళ్లు"

అనలే భూస్వామ్య విధానంతో కృంగి కృశించి పోయిన వ్యవసాయకూలీలు పనులు దొరక్క కొత్తగూడెం గనులకు వస్తే, జీతాలు తక్కువయివ్వడమేకాకుండా, ఉద్యోగస్తులకు "మామూళ్లు" ఎన్నోయిచ్చుకోవలసివస్తూంది. ఒక్కొక్క కార్మికునికి 20, 30 సంవత్సరాల సర్వీసుఉన్నా, అతని ఉద్యోగానికి సెక్యూరిటీలేదు (పెర్మనెంటుకాలేదు). పై అధికారులవల్ల యెప్పుడూ తిట్లు, తన్నులు, బూతులు, తినవలసివస్తోంది.

వైద్యసహాయం

ఇచ్చట హాస్పిటల్ ఒకటి 4 లక్షలుపెట్టి కట్టించారు. మంచాలు 200 కంటెయెక్కువలేవు. ఆడవాండ్లకు 50 మాత్రమే. అకస్మాత్తుగా దెబ్బలు తగిలినవారికి, చాలాకాలంనుండి జబ్బుతోబాధపడేవారికి, చర్మరోగాలవారికి, అందరికీ కలిపి యీ మంచాలు సరిపోవు. బయటివారికి, అనగా ధనంఉన్న వర్తకులకు, డబ్బుతీసుకొని మంచి మందులిస్తారు. కార్మికులవద్ద సహితం వైద్యులు లంచాలు పుచ్చుకుంటారు. లంచం యివ్వనివారికి మంచిమందులు లేవు. రోగం కుదిరినా, కుదరకపోయినా, ఆసుపత్రినుండి త్వరత్వరగా రోగుల్ని బయటికి తొలగిస్తూ ఉంటారు. ఉన్న కొద్దిరోజులు సరియైన ఆహారం ఉండదు. ఉడికీ ఉడకని రొట్టె బిళ్ళలు జీర్ణంకానందున, చాలా మంది రోగులు పస్తులుంటారు. కొద్దిమంది మాత్రం వారి సొంత యేర్పాట్లు చేసుకుంటారు.

స్త్రీ కార్మికులకు లేడీ డాక్టరు గాని, ప్రసూతి సౌకర్యం గాని, లేదు. చట్టరీత్యా, ప్రసవించే ముందు 3 వారాలు, ప్రసవించాక 4 వారాలు, స్త్రీ కార్మికులకు జీతంతో సెలవియ్యాలి. కాని, యీ నిబంధన అమలు జరగడంలేదు.

విద్యాసౌకర్యాలు శూన్యం

కొత్తగూడెం గనులపని మొదలుపెట్టి 7, 8 సంవత్సరాలైనప్పటికీ, జనాభా 10 వేలకు పెరిగి నప్పటికీ, చెప్పదగ్గ మిడిల్‌స్కూలు ఒక్కటికూడా లేదు. పేరుకు మాత్రం ఒక ప్రైమరీ స్కూలు ఉంది. అదికూడా కార్మికులు నివసించే ప్రదేశంలోలేదు. సింగరేణిలో ఉన్న మిడిల్‌స్కూలును కొత్తగూడెము మార్చడానికి యెట్టి ప్రయత్నం జరగలేదు. కార్మికుల బిడ్డలకు విద్యాసౌకర్యం లేకపోవడంవల్ల, నేర్పుగల కార్మికులు తయారుకావడంలేదు.

గనులలో ప్రమాదాలు

ప్రభుత్వ లెక్కలనుబట్టి, 10 లక్షలటన్నుల బొగ్గుకు ప్రాణనష్టం 10. ఇంగ్లాండులో 4 గురు మాత్రమే. కొత్తగూడెం గనులలో పనిచేయునప్పుడు కార్మికులకు గాయాలు తగిలితే, చట్టప్రకారం సరియైన నష్టపరిహారం యివ్వకుండా బయటికిపంపే అలవాటుఉంది. ఎప్పుడైనా నష్టపరిహారం యివ్వవలసి వచ్చినప్పుడు చాలా ఆలస్యం జరుగుతుంది. చనిపోయిన సంవత్సరానికికూడా నష్టపరిహారం దొరకని కేసులు ఉన్నాయి.

భూగర్భంలో బొగ్గు తవ్వేటప్పుడు సరియైన రక్షణ యేర్పాట్లు లేకపోవడంవల్ల పై భాగం ఒకొక్కప్పుడు కూలిపోవడం జరుగుతుంది.

ప్రావిడెంటుఫండు ఏర్పాట్లు

ప్రావిడెంటుఫండు యెక్కువ జీతాలకు మాత్రమే ఉంది. సాధారణ కూలీలకు, రు. 22-8-0 క్రిందివారికి, లేదు. సేవింగ్సు స్కీములోమాత్రం, యిష్టం ఉన్నవారు చేరవచ్చు. కాని, యజమానులు దానికేమాత్రమూ కంట్రిబ్యూట్‌చేయరు. పనినుంచి రిటైరు అయ్యేటప్పుడు కార్మికులు దాచుకున్న కొద్దిమొత్తాన్ని మాత్రమే యిస్తారు. ఈ మధ్యమాత్రం కేంద్రప్రభుత్వచర్య ఫలితంగా బొగ్గును తవ్వేవారికి, బొగ్గునింపేవారికి, మాత్రం పనికిసరిగా హాజరైతే రోజుకు 2 అణాలు యిస్తున్నారు. మిగతావారికి శూన్యం. అందువల్లవారిలో అసంతృప్తికి కారణమవుతూంది.

కార్మికులపట్ల భేదభావం

కేంద్ర ప్రభుత్వం కొత్తగూడెముకు 1000 మంది గోరఖ్‌పూర్ (యు. పి.) కార్మికుల్ని పంపించింది. వీరికి నెలకు రు. 30 జీతం. ఉచితంగా బట్టలు, గోధుమపిండి, బియ్యం, కూరలు, జబ్బుచేస్తే సెలవులు, ఇస్తున్నారు. వీరిలో ఒక్కొక్కరు రోజుకు 1 టన్‌కంటె యెక్కువ బొగ్గును తీయరు. అనుభవజ్ఞులైన కొత్తగూడెం కార్మికులుకూడా బాగాపనిచేయగలిగిన వారైనప్పటికీ వారికిచ్చే కూలిచూస్తే, రోజుకు రు. 1 మాత్రమే. ఇతరసౌకర్యాలు వీరికి లేవు. కార్మికులపట్ల చూపబడే యీ భేదభావం కార్మికులలో తీవ్రమైన అసంతృప్తిని కలిగించుతోంది. కరువుభత్యంతో సహా, సగటున పురుషునికి రు. 1, స్త్రీకి 0-9-0, పిల్లవానికి 0-7-0 మాత్రమే యిస్తున్నారు.

ఉత్పత్తి కుంటుపడుతోంది

ఈ విధంగా, కొత్తగూడెం కార్మికుల విషయంలో యజమానులుగాని, ప్రభుత్వంగాని, తగినంతశ్రద్ధ తీసుకోకుండా, వారిని అనేక బాధలకు గురిచేయడంవల్ల బొగ్గు ఉత్పత్తి కుంటుపడుతోంది. 1941, 1942 సంవత్సరాలతో పోల్చి చూచినట్లయితే, యిప్పుడు 100 కి 55 చొప్పున మాత్రమే ఉత్పత్తి కాబడుతోంది. 1943 వ సంవత్సరంలో మొత్తం 1600టన్నులు ఉత్పత్తి చేయబడింది. 1944 లో మార్చి చివరవరకు 300 టన్నులు తయారైంది. అనగా 1944 వ సంవత్సరాంతానికి 1200 టన్నులు మాత్రమే తయారౌతుందన్న మాట! బ్రిటిష్ ఇండియాలో ట్రేడ్‌యూనియన్‌చట్టం క్రింద పారిశ్రామిక కూలీలందరూ సంఘాలలో చేరి, సంఘచైతన్యం పొంది, తమ పరిస్థితుల్ని బాగుచేసుకోడానికి యత్నిస్తూంటే, కొత్తగూడెం కార్మికులు సంఘాన్ని నిర్మించుకోలేకపోయారు. ఎందువల్లనంటే, యజమానులు అన్నివిధాలైన నిర్బంధాలు ప్రయోగిస్తున్నారు.

ప్రభుత్వానికి విజ్ఞప్తి

అస్సాం సరిహద్దులలో ఒకవైపు యుద్ధం కొనసాగుతూ, మరొకవైపు దేశమంతటా కరువుబాధ యెక్కువై ఉన్న రోజులలో, ప్రభుత్వం కార్మికులలో ఉత్సాహాన్ని కలిగించి, బొగ్గు యెక్కువగా ఉత్పత్తి అయేటట్లు చూడాలి. అందుకు కార్మికుల పరిస్థితుల్ని బాగుచేయాలి. కార్మికులు సంఘాన్ని స్థాపించుకొనే ప్రయత్నాలకు యజమానులెట్టి ఆటంకాలు పెట్టకూడదు. కార్మికులుకూడా తమకోర్కెలను సాధించుకొనేటందుకు ధైర్యంతోసంఘస్థాపనకుపూనుకోవలసియుంది.

ప్రజాశక్తి చందావివరాలు

సంవత్సరం చందా	5—0—0
అర్ధసంవత్సరం చందా	2—8—0
మూడునెలల చందా	1—4—0

ఇటలీ స్వాతంత్ర్యపోరాటానికి చేయూతనిస్తుంది సోవియట్

ఇటలీపై మిత్రమండలి సేనలు దాడి ప్రారంభించాయి. ప్రజా ఉద్యమాలు వెల్లువగా పొంగాయి. ముసోలినీ పలాయనమయాడు. ఫాసిజాన్ని రూపుమాపుతానని ప్రతిజ్ఞచేస్తూ బడోలియో పరిపాలన బాధ్యత వహించాడు. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను తిరిగి చవిచూడ గలమని ప్రజలు ఉప్పొంగిపోయారు.

కాని, పరిస్థితులు మరోదారి పట్టాయి. మిలిటరీ అవసరాలను సాకుచెప్పి బడోలియో ప్రజా ఉద్యమాలను అరికట్టడం ప్రారంభించాడు. బ్రిటిష్, అమెరికన్, సామ్రాజ్యవాదులు, తమ మిలిటరీ ప్రభుత్వవర్గం (అంగాట్) ద్వారా ఇటలీ వ్యవహారాలపై పెత్తనం చలాయించ సాగారు. ప్రజా ఉద్యమాలను ప్రతిఘటించడంలో ఇమాన్యుయల్ రాజుకి, బడోలియోకి మద్దతు నిలిచారు. రాజరికం అంతరించాలని ప్రజలాందోళన చేస్తూంటే, రాజరికాన్ని సమర్థిస్తూ ఇమాన్యుయల్ ఉపన్యాసం ఇచ్చేలా ప్రోత్సహించారు. "రాజరికాన్ని తొలగించడం ఎవరి తరంగాద" ని అతనిచేత ఎదురు సవాల్ చేయించారు. ఫాసిస్టు ప్రతికూల పక్షాలన్నీ బారీలో సమావేశం కాబోతే బడోలియో నిషేధించాడు. బ్రిటిష్, అమెరికన్ మిలిటరీ అధికారవర్గం ఈనిషేధాన్ని సమర్థించింది. తమ మిలిటరీ ప్రభుత్వ వర్గానికి నాయకునిగ, కోటీశ్వరుడయిన రెన్నెల్ ప్రభువుని నియమించారు. బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులు, యుద్ధాకి పూర్వం జర్మనీతో వ్యాపార సంబంధాలున్నవాడతను. ఇతని తత్వం స్పష్టంచేయడానికి ఒక్క ఉదాహరణ చాలు. సిసిలీలో ఇతను పీఠం వేసుకున్న తరువాత, 'న్యూస్ క్రానికల్' పత్రికా విలేఖరి వెళ్ళి, ఫాసిస్టు ప్రతికూల ఖైదీల నిక విడిపిస్తారు కదా అని అతన్ని అడిగాడు. "సాధారణ నేరస్థులను గురించే మేము చర్య తీసుకుంటాం. రాజకీయఖైదీల జోలిమాకు లేద"ని అతను తడుకూ బెడుకూ లేకుండా జవాబు చెప్పాడు. ఇలాంటివాని అధికారం కిందనున్న ముఠా ఫాసిస్టు ప్రతికూల ఉద్యమాలకు తోడ్పడుతుందో, లేక వాటికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తుందో వేరే చెప్పనక్కరలేదు.

కారణం ఏమిటి ?

ఇటలీ ప్రజలపైని బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదు లీ "అంగాట్" నెందుకు రుద్దారు? దీనిద్వారా రాజుని, బడోలియోని ప్రజలకు వ్యతిరేకంగా ఎందుకు ప్రోత్సహిస్తున్నారు? ఉత్తరాఫ్రికాను పోగొట్టుకున్నట్లే, ఇటలీనికూడా పోగొట్టుకోకూడదని వీరి ఆశ. ముందు డార్లన్ని, తరువాత జీరోని, కీలుబొమ్మగ నిలబెట్టి ఉత్తరాఫ్రికాను తమ గుప్పిట్లో భద్రపరచుకోవాలని చూచారు వీరు. కాని ప్రజాశక్తికి తట్టుకోలేక ఆ ఆటను చాలించవలసివచ్చింది. ఇటలీలో ముందుగానే జాగ్రత్తపడ్డారు. మిలిటరీ అవసరాలకోసం అంటూ "అంగాట్"ని సృష్టించారు. ఆ సాకు చెబుతూనే ఇమాన్యుయల్, బడోలియోల చేష్టల్ని సమర్థిస్తున్నారు. ప్రజా పక్షాలను గుర్తించం పొమ్మంటున్నారు.

ఇటలీ పాలకవర్గం సంగతేమిటి? బ్రిటిష్ అమెరికన్ మిలిటరీ బలం అందలేకపోతే వాళ్ళొక్కఘడియకూడా నిలవలేరు. ఆబలం పైనే ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ విధంగా బ్రిటిష్ అమెరికన్ సామ్రాజ్యవాదులు, తమకు సహజమైన చీలదీసి పాలించే పద్ధతిని అమలు జరుపసాగారు. దీనిఫలితంగా ఇటలీ ప్రజలు యుద్ధకృషికి దూరమయారు. తత్ఫలితంగా ఇటలీ స్వాతంత్ర్య సమరం కుంటుపడింది.

ప్రజల ఆందోళన

ఇటలీలో అధికభాగం ఇంకా శత్రువు చేతిలోనేఉంది. నాజీనరకాన్ననుభవిస్తున్న అక్కడి ప్రజలను వెంటనే విముక్తి పరచవలసిన బాధ్యత ఇంకాతీరలేదు. ఈలోగానే ఇంతలేసి పన్నాగాలు పన్నుతున్నారు. వీటిని సహించలేక ఇటలీదేశభక్తుల్లో కొందరు, "ప్రభుత్వం వెంటనేప్రజాస్వామికప్రభుత్వంగామారాల"ని ఆందోళన లేవదీశారు. ప్రజాశక్తులన్నిటినీ సమీకరించి, అభివృద్ధి నిరోధక ఫాసిస్టు ముఠాలను రూపుమాపి, దేశస్వాతంత్ర్యాన్ని త్వరలో సాధించాలనే దీక్షతో ఈ ఆందోళన సాగించారు. ఇటలీ కమ్యూనిస్టు నాయకులు ఈ ఆందోళనను బలపరిచారు. సోవియట్ పత్రికలు పూర్తి సహకారం చేశాయి. "అంగాట్ ఇటలీలో ఫాసిస్టుపరిపాలక యంత్రాన్ని నిలబెడుతూంది. కాబట్టి దానిని రద్దుచేయాల"ని 'వార్ అండ్ వర్కింగ్ క్లాస్' పత్రికరాసింది. మాస్కో సమావేశం ఈ విషయాన్ని సాకల్యంగా చర్చించింది. అంగాట్‌ని రద్దుచేయాలనీ, దానిస్థానంలో మిత్రమండలి కమిషనొకటి ఏర్పడాలని తీర్మానించింది.

ప్లేటు మార్చారు

ఈ కమిషన్ ఏర్పడినదగ్గర్నుంచి బ్రిటిష్ అమెరికన్ సామ్రాజ్యవాదులు ప్లేటు మార్చారు. ఈ కమిషన్ సరిగా పనిచేస్తే ఇటలీలో ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడుతుంది; ఇక తమ ఆటలు సాగవని వీరికి తెలుసు. ఇక దానిపనికి అంతరాయాలు కల్పించసాగారు. రోము చేరేవరకూ బడోలియో ప్రభుత్వంలో మార్పు ఉండదని చర్చిల్ గర్జించాడు. ప్రజాపక్షాలను నమ్మలేమన్నాడు. "అయినా మాకేలాంటి పక్షపాతం లేద"ని చెప్పుకోడానికి బడోలియో ప్రభుత్వాన్ని రాజ్యాంగరీత్యా గుర్తించలేదు. ఇదంతా రాజు, బడోలియో, "అంగాట్"ల, గూడుపుఠానీఅనిఅనుమానించి ఇటలీలోని దేశభక్తియుత పక్షాలన్నీ ఇమాన్యుయల్‌పైని, బడోలియోపైని తీవ్రదాడి ప్రారంభించాయి. ఇమాన్యుయల్ రాజీనామా నివ్వాలి, బడోలియోపోవాలి, అన్నవే ప్రధాన నినాదా లయాయి. ఈ అంతర్యుద్ధంకన్నా బ్రిటిష్, అమెరికన్ సామ్రాజ్యవాదులకు కావలసింది మరేదీ లేదు. అటున్న జర్మన్ మూకలక్కూడా ఇదెంతో అనుకూలం.

సోవియట్ చర్య

ఈ పరిస్థితివల్ల ఇటలీ స్వాతంత్ర్యపోరాటానికే కాకుండా, యూరప్ దాస్యవిముక్తికూడా కలిగే ప్రమాదాన్ని సోవియట్ గుర్తించింది. ఇటలీలో అంతర్విభేదాలు తొలగించాలి; ప్రభుత్వానికి ప్రజాశక్తులకు ఐక్యత కుదర్చాలి; ప్రజాస్వామిక ప్రభుత్వానికి అవకాశాలు కలిగించాలి. ఈ కార్యక్రమాన్ని వెంటనే అమలు జరపాలని నిశ్చయించింది. ఇందుకు ప్రజలతోను, ప్రభుత్వంతోను సంబంధం ఉండాలి. 'మిత్రమండలి కమిషన్' ద్వారా సోవియటుకి ప్రజలతో సంబంధం ఉంది. ప్రభుత్వంతో బ్రిటిష్, అమెరికన్ ప్రభుత్వాలకు 'అంగాట్' ద్వారా సంబంధం వుందికాని, తనకు లేదు. ఈకొరత తీర్చడానికి సోవియట్ ప్రభుత్వం బడోలియో ప్రభుత్వంతో సరాసరి సంబంధం ఏర్పరచుకుంది. "అందరి శత్రువయిన నాజీజర్మనీని ఓడించడానికి అనుకూల పడేలా ఇటలీ రాజకీయాలను నడపడం మిత్రరాజ్యాల కర్తవ్యం. ఇందుకు వెంటనే బడోలియో ప్రభుత్వానికీ, "జాతీయ స్వాతంత్ర్య కమిటీ" (ఫాసిస్టు ప్రతికూలపక్షాల ఐక్య కమిటీ)కీ ఐకమత్యం కుదర్చాలి. ఈ ఉద్దేశంతోనే సోవియట్‌ప్రభుత్వం బడోలియోప్రభుత్వంతో సరాసరి సంబంధ కుదుర్చుకొంది. అంతేగాని, ఇప్పుడున్న బడోలియో ప్రభుత్వాన్ని శాశ్వతంగా నిలబెట్టడానికి కాదు" అని ఇజ్వెస్టియా పత్రిక రాసింది. ఈ వైఖరిని ఇటలీ దేశభక్తులందరూ అభినందించారు.

ఫలితాలు

ఈచర్యతో బ్రిటన్, అమెరికన్, సామ్రాజ్యవాదులకు ఆట కట్టయింది. పరిస్థితులు తమ అధీనంలోంచి తప్పిపోతున్నాయని గుర్తించారు. "ఇటలీ వ్యవహారాలు బ్రిటన్ అమెరికాల సొంత వ్యవహారాలు. వీటిలో ఇతరులకు జోక్యంలేద,"ని ఈడెన్ మంత్రికామన్సుసభలో మొండిగా బుకాయించాడు. కాని, ఇతనే "రోముకు వెళ్ళకముందే బడోలియో ప్రభుత్వంలోమార్పులు తేవడానికి ప్రయత్నిస్తామ"ని అంగీకరించక తప్పిందికాదు. రాజరికాన్ని పట్టుకువ్రేలాడాలనుకున్న ఇమాన్యుయల్, తనకొడుకుని లెఫ్టినెంట్ జనరల్‌గా నియమించి, రోముకు చేరగానే అతనికి రాజ్యం వప్పగించేస్తానని ప్రకటించకతప్పిందికాదు. "బడోలియో ప్రభుత్వంలో చేరడానికి మేము సిద్ధంగా ఉన్నామ"ని ప్రజాపక్షాలు ప్రకటించాయి. ఈ విషయంలో కమ్యూనిస్టుపార్టీ ప్రముఖపాత్ర వహించింది. బడోలియో తన మునుపటి ప్రభుత్వాన్ని రద్దుచేశాడు. కమ్యూనిస్టుపార్టీ మొదలయిన వివిధ ప్రజాపక్షాల ప్రతినిధులతో కొత్తమంత్రివర్గాన్ని నియమించడానికి రాయబారాలు ప్రారంభించాడు. అంటే - ఇంతవరకు ప్రజల్ని అణచివుంచిన శక్తులు బలహీనమవుతున్నాయన్నమాట. ఇటలీ ప్రజాస్వాతంత్ర్య పోరాటం, కొత్తచైతన్యంతో ముందుకు సాగగలదన్నమాట.

విషప్రచారం

ఇటలీ స్వాతంత్ర్య పోరాటానికి ఇలా నూతన చైతన్యాన్ని ప్రసాదించిన సోవియట్ చర్యను, ప్రజాస్వామికానికి ద్రోహంగా చిత్రించాడు చుండి జగన్నాధం, 14 వ తేదీ జమీన్‌రైతులో. తన దేశంలోని వివిధ ప్రజాశక్తులను సంఘటిత పరచి, స్వాతంత్ర్య పోరాన్ని ఏకముఖంగా నడపడానికి ఎర్కోలి (ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడు) చేసిన ప్రయత్నాలను రష్యాకు గులాం పనిగా చిత్రించాడితను. వక్రబుద్ధి, పూర్వాపరజ్ఞానం లేకపోవడం ఇతని వ్యాసంలో కనబడుతూంది. ఈ విశేష లక్షణాలతో ఇతను స్టాలిన్ రాజకీయాలను విమర్శించబోయాడు.

నిజమయిన ప్రజాస్వామిక రాజ్యమయిన సోవియట్ యూనియన్‌కి ప్రపంచ ప్రజాసామాన్యం యొక్క స్వాతంత్ర్య రక్షణ తన స్వాతంత్ర్యానికి పెట్టనికోట. అందుకనే నాజీ బానిసత్వాన్ని రూపుమాపి, ప్రపంచ ప్రజాస్వాతంత్ర్య మహోద్యమాన్ని జయప్రదంగా సాగించడానికి తోడ్పడుతూంది. సోవియట్ యూనియన్.

బియ్యానికి, ధాన్యానికి గరిష్ఠ ధరలు

★

కృష్ణాజిల్లాలో బియ్యానికి, ధాన్యానికి గరిష్ఠ ధరలు నిర్ణయిస్తూ, కృష్ణాజిల్లా కలెక్టరుగారు ఈనెల 6 వ తేదీన ఉత్తరువులు చేశారు.

దీని ప్రకారం, బియ్యం మిల్లుల వారమ్మవలసిన ధర కిచిడీ, వంకసన్నం, ఢిల్లీభోగం, కృష్ణకాటుకలైతే ఇంపీరియల్ మణుగు (36 కొలతశేర్లు) రు 8-5-3, కుసుమ, అక్కుళ్ళు, రామసాగరాలైతే రు. 8-1-3.

ధాన్యం ధరలు - కుసుమ, అక్కుళ్లు, కొనామణి మణుగు 1కి (80 పౌనులు) రు. 5-2-0; రామసాగరం రు 5-3-0; ఢిల్లీభోగం, వంకసన్నం రు. 5-5-6; సన్నకృష్ణకాటుకలు రు. 5-6-0; కిచిడీ రు. 5-7-0 గా నిర్ణయించబడినవి.

మిల్లుదారులుగాని, యితర లైసెన్సుదారులు గాని, బియ్యపు ధరలమీద మణుగుకు 0-4-0, ధాన్యపు ధరలమీద మణుగుకు 0-3-0 కంటే ఎక్కువ లాభం వేసుకోకూడదు. చేమార్పు కర్చు మణుగుకు ఒక అణా, వాస్తవంగా అయిన బండిఖర్చు, సేల్సుటాక్సు - ఇవిమాత్రం చేర్చవచ్చును. ప్రతి లైసెన్సుదారుడు బండిఖర్చు, సేల్సుటాక్సు, చేమార్పు ఖర్చు, తనకు మిగులుతున్న లాభం, వీటి వివరాలను నిక్కచ్చిగా తెలియచేస్తూ, ఒక స్టేటుమెంటును తన దుకాణంలో అందరికీ కనబడే చోట వ్రేలాడగట్టాలి.

గరిష్ఠధరలంటే — అమ్మకాలు ఈ ధరలకంటె మించి వుండగూడదని అర్థం. నెల్లూరు గుంటూరు, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి, విశాఖపట్నం జిల్లాలకుగూడా గరిష్ఠ ధరలను నిర్ణయిస్తారని తెలుస్తోంది.

★ యుద్ధటిక్కెట్ల అమ్మకంలో

ఉద్యోగులచర్యలు - ప్రజలవిజయం

— మాదల వీరభద్రరావు

సత్తెనపల్లిలో "వింధ్యారాణి" నాటకం. గాయపడిన సైనికుల సహాయనిధికై అయిదు రోజుల్లో 13 వేలరూపాయలు వసూలుచేయాలని నిర్ణయమట. 4 వ తేదీ మధ్యాహ్నం తహసిల్దారు, కమర్షియల్ సేల్స్‌టాక్స్ ఆఫీసరు, సబ్‌యిన్‌స్పెక్టరు, మేజిస్ట్రేటు, 4 గురు పోలీసులతో మాదల విచ్చేశారు. షాహుకార్లను పిలిపించారు. షాహుకార్ల యెక్కువ తక్కువ లాలోచించకుండా, తాము చెప్పిన విరాళాలు చెల్లించాలని నిర్బంధించసాగారు. ఇద్దరు ముగ్గురు, తాము చెల్లించుకోలేమని మొరపెట్టుకుంటే, తహసిల్దారు వారిపై దౌర్జన్యం ప్రయోగించారు. ఒక స్థానికవకీలు అధికార్లపక్షంచేరి, షాహుకార్లను బూతులు తిట్టనారంభించారు. మొత్తం 2 గంటల సేపట్లో రు. 950 రొఖ్ఖం వసూలుచేసి, రు. 900 లకు జాబితావేసుకొని వెళ్లిపోయారు.

5 వ తేదీని నేను యింటికొచ్చేసరికి జరిగిన తంతు యిది.

షాహుకార్లు, గ్రామస్థులు, యీసంఘటనవల్ల భయపడిపోవడం చూచాను. 1940 అక్టోబరులో యిలాగే ఒక్కరాత్రిలో రు. 1800 వసూలుచేసుకువెళ్ళారు. 1943 లో మళ్ళీ 11 వేల రూపాయలకు యుద్ధబాండ్లు కొనిపించారు మళ్ళీ యీసారి రు. 950 వసూలు చేశారు. షాహుకార్లు యీ నిరంకుశపద్ధతుల వల్ల మనోధైర్యాన్ని కోల్పోతున్నారు. మన మాతృదేశాన్నిరక్షించే సైనికుల సహాయార్థం యిట్టి పద్ధతులేనా అవలంబించవలసింది?

వెంటనే మదరాసుకు టెలిగ్రాంయిచ్చి, కేసు పెట్టబోయేముందు ఉద్యోగులతో కలిసి మాట్లాడుట అవసరమని తలచాం. నేను, తాలూకా కమ్యూనిస్టుకమిటీ సెక్రటరీ, తాలూకా రైతుసంఘ అధ్యక్ష, కార్యదర్శులు, తాలూకా వ్యవసాయ కూలీసంఘ కార్యదర్శి కలిసి తాలూకా ఆఫీసుకువెళ్ళాం. ఆఫీసర్లంతా ఉన్నారు. డిఫెన్సుబాండ్లనుగాని, రెడ్‌క్రాస్ ఫండునుగాని, మేము వ్యతిరేకించమని స్పష్టంగా తెలియజేశాము. అయితే, ప్రభుత్వోద్యోగులు యీవిధంగా గ్రామాలలో నిరంకుశపద్ధతు లవలంబించడంవల్ల యుద్ధకృషికి, ప్రజల మనోనిబ్బరానికి తీని దెబ్బకాబట్టి ఆట్టి పద్ధతులను వ్యతిరేకిస్తామని ఖంటాపథంగా తెలియజేశాం. తహసిల్దారు, తాను దౌర్జన్యం చెయ్యలేదన్నారు. అయినా, యికముందు మాసహకారంతోనే పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు.

6 వ తేదీని మాదలవచ్చి, వర్తకుల్ని సమావేశపరిచాం. ఆత్మగౌరవంగలిగి, ధైర్యంగాను, ఐక్యతతోను ఉండవలసిందని హెచ్చరించాం. గాయపడ్డ సైనికులకు సహాయం చేయడంలో ఎట్టి ఆక్షేపణలేదని రుజువుచేశాం. ఎవరిమట్టుకువారు, వేర్వేరుగా కాకుండా సమిష్టిగా, వారి వారి తాహతునుబట్టి చెల్లించడం మంచిదని సూచించాము. దీనవారిని మినహాయించి, మిగతావారు వాటాలవంతున యివ్వడాని కంగీకరించారు. గ్రామం మొత్తంమీద పట్టీ ఒకటి తయారుచేశారు. 9 మంది ప్రతినిధులం ఆఫీసర్లవద్దకు వెళ్లాం తహసిల్దారు "మీ యిష్టంవచ్చినంత యివ్వండ"న్నారు. అదివరలో ఉద్యోగులు వేసుకున్న జాబితా రు. 900. అందులో రు. 166 మాత్రమే చెల్లించి తిరిగి వచ్చాం.

దీనితో రైతుసంఘ కృషి అందరికీ అర్థమయింది. వర్తకులలో అపూర్వమైన మార్పు వచ్చింది. రైతుసంఘ వర్కర్లు వర్తకులతో "మీరుగ్రామక్షేమం, ప్రజలశ్రేయస్సుకోరుతూ సహకారంచేస్తే, మేము మీకు సర్వవిధాల సహాయపడతా"మనిచెప్పారు. వారి దుకు అంగీకరించారు.

★

నిల్వవ్యాపారస్తులపై అదిలాబాద్ పౌరుల విజయం

హైదరాబాద్ ప్రభుత్వం బెల్లంధర మణుగు రు. 3-6-0 చొప్పున కంట్రోల్ చేసినప్పటికీ, ప్రజలకు సరుకు సక్రమంగా అందే యేర్పాటు చేయనందున, షుమారు 3000మణుగుల సరుకు దొంగమార్కెట్టుకు చేరింది. అదిలాబాద్ తాలూకాలో గత 2 మాసాల నుండి పేదప్రజలకు బెల్లం దొరుకుటలేదు.

స్థానిక ఆంధ్రమహాసభ కార్యకర్తలు యీ పరిస్థితినుండి ప్రజల్ని కాపాడుటకు నిర్ణయించుకున్నారు. మార్చి 26 వ తేదీని ఒక వర్తకుడు బండినిండా బెల్లపుఉండలనెక్కించి తోలించుకుపోతూంటే, ఆసరుకును కంట్రోలుధర కమ్మవలసిందని కోరారు. అతడు నిరాకరించాడు. పోలీసులుతోడ్పాటు కలిగించుకొనుట కంగీకరించలేదు. జిల్లాపోలీసుసూపరింటెండెంటుతో యీ విషయమై జిల్లా ఆంధ్రమహాసభ కార్యదర్శి, కోశాధికారి ఫిర్యాదుచేస్తే, కంట్రోలు ఆర్డరును అమలుపరచడంపోయి, వారిమీద కేసుపెడతాననిఆయనబెదరించాడు!

తరువాత, ఆంధ్రమహాసభ కార్యకర్తలు ప్రతిపేటలోను రైతుల్ని, యితర ప్రజాసామాన్యాన్ని, సమావేశపరచి, నిలవ వ్యాపారస్తుల చర్యను ఖండిస్తూ ప్రచారంచేశారు. ఏయే కుటుంబాని కెంతెంత బెల్లం అవసరమో లెక్కలు తయారుచేసి, వారందరినీ పెయిష్కార్ వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్ళారు. పెయిష్కార్‌వద్ద వ్యాపారస్థుల లిస్టు, స్టాకుల లిస్టు ఉన్నప్పటికీ, ఆలిస్టును చూపడానికి నిరాకరించాడు. కేవలం ముకువు చెల్లించడానికి కొద్దిమంది వర్తకుల్ని సమావేశపరచి "మీవద్ద యేమైనా స్టాకులున్నాయా?" అని ప్రశ్నించాడు. వారు సహజంగానే "లేవు" అని జవాబిచ్చారు. కొంతమంది 5, 10, 15 ఉండలు మాత్రం ఉన్నాయని చెప్పారు. ఆంధ్రమహాసభ వర్కర్లు, యిదిపద్ధతికాదనుకున్నారు. మ్యునిసిపల్ అధికారుల్ని, "రసద్" (ఆహార ధాన్యాల) ఇన్‌స్పెక్టరును, వెంటబెట్టుకొని, ప్రజలందరితో ఒక నిల్వ వ్యాపారస్తుని గిడ్డంగుకు తీసుకెళ్లారు. దాన్ని తెరిపించారు. లోపల షుమారు 300 మణుగుల బెల్లం రహస్యంగా ఉంచబడింది. దాన్ని కంట్రోల్ రేటుకు అమ్మేలాగు ప్రజలు ఒత్తిడిచేశారు. స్థానికవర్కర్లు వాలంటీర్లుగా పనిచేశారు. క్రమశిక్షణతో ఆ సరుకంతా ప్రజలకు అమ్మించారు.

కృష్ణాజిల్లాలో "నీటిశిస్తు రిమీషన్"

మద్రాసు ప్రభుత్వం ఈ ఫసలీనుండి రీసెటిల్మెంటు రేట్లను వసూలుచేయుటకు నిశ్చయించునప్పుడు గోదావరి, కృష్ణా డెల్టాలలో యిదివరకు ఇస్తున్న నీటిశిస్తు రిమీషన్లను యిస్తూవుండడానికే నిశ్చయించినది. కాని కృష్ణాజిల్లాలో ఇట్టిది మినహాయించకుండా, పూర్తిశిస్తును వసూలుచేసినట్లు అనేకగ్రామాల నుండి ఫిర్యాదులు మా ఆఫీసుకు వచ్చుచున్నవి. ఇందుపై వెంటనే యీ సమస్యను జిల్లాకలెక్టరుగారి దృష్టికితెస్తూ, వసూలుచేయబడ్డ మొత్తములనురైతులకు రిఫండుచేయమని కోరివున్నాను. జిల్లాకలెక్టరు అందుపై సమాధానమిస్తూ రివిన్యూ ఆఫీసర్ల అందరికీ అవసరములగు సలహా లీయబడ్డవని తెలియజేశారు. కాబట్టి, వెంటనే రైతులు నీటిశిస్తు మినహాయింపు సొమ్మును ముజరా యిప్పించవలసినదిగా కోరుతూ తహసిల్దారులందరికి పిటీషన్లు పెట్టుకోవలసినదిగా కోరుతున్నాను.

—నండూరి ప్రసాదరావు.
(ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ కార్యదర్శి)

ఇందుపూరులో లంచగొండితనం నిర్మూలించబడింది

నెల్లూరుజిల్లా, అల్లూరు సెక్షన్‌లో కొన్ని గ్రామాల పెత్తందార్లు, డబ్బిస్తే ఓవర్‌సీరుగారు యెక్కువ నీటిని సప్లయి చేస్తారని మధ్యపెట్టి, యకరానికి రు. 1 చొప్పున వసూలు చేస్తున్నారు. ఈ లంచగొండితనాన్ని నిర్మూలించుటకు జిల్లారైతుసంఘ కార్యదర్శి, సహాయ కార్యదర్శి, తాలూకా రైతుసంఘ కార్యదర్శి, కలసి పని ప్రారంభించారు.

ఇందుపూర్ గ్రామంలో మొత్తం రు. 600 వసూలైంది. లంచగొండి తనాన్ని ఖండిస్తూ యీ నెల 4, 5 తేదీలలో బహిరంగసభలు జరుపబడ్డాయి. కాంగ్రెసు - జస్టిస్ - కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులతో గూడిన ఒక ఇరిగేషన్ కమిటీ ఏడుగురితో స్థాపించబడింది. ఈ కమిటీ సభ్యులు ఓవర్‌సీయరు వద్దకెళ్ళి, సరియైన అంచనావేసి నీటిని తెప్పించవలసిందనీ, చెడిపోయిన 7 తూములకు చెక్కలు వేయించవలసిందనీ, పోయిన 5 చెక్కలు తిరిగి వేయించవలసిందనీ కోరారు. లంచగొండి తనాన్ని నిలుపుజేయ వలసిందని నొక్కి చెప్పారు.

ఓవరుసీయరు ఓపికతోవిని, ఇరిగేషన్ కమిటీయొక్క సహకారంతో తప్పక పని చేయడాని కంగీకరించాడు. నీటిసప్లయి విషయంలో పనిచేయుటకు రైతుసంఘం ఒక హోల్‌టైమరును నియమించింది. 6 గురు వాలంటీర్లు ఒక్కొక్క కాలువక్రింద ఎంత ఆయకట్టు ఉన్నదో, లెక్కలు తీస్తున్నారు (9-4-44 నాటికి). దొంగతనంగా ఎక్కువ నీరు యిస్తున్న 3 రు కళానులను పట్టుకున్నారు. ప్రతివారం నీటి రిపోర్టును ఓవర్‌సీరుకు పంపుతున్నది గ్రామరైతుసంఘం. ఎవరూ యిప్పుడు లంచాలిచ్చి వేర్వేరుగా నీటికై ప్రయత్నాలు చేయడంలేదు.

రైతుల-కూలీలమధ్య సామరస్యం

చింతలపూడి తాలూకాలో (ప. గోదావరి) ప్రగడవరం అనేగ్రామం ఉంది. అక్కడ యుద్ధానికి పూర్వంనుంచీ జీతగాళ్లకు(పాలేళ్ల) నెలకు 20 మానికల ధాన్యం, సంవత్సరానికి రు. 20 జీతం, మాత్రమే యిస్తున్నారు. ఆ 20 మానికల ధాన్యమైనా సరియైన మానికతో కొలిచేవారుకారు. యుద్ధకారణంగా వ్యవసాయకూలీల జీవితం దుర్భరమై, పిచ్చిముంతల పద్ధతిని రద్దుచేయ వలసిందనీ, జీతం హెచ్చుచేయ వలసిందనీ, రైతుల్ని కోరారు. రైతులు నిరాకరించారు. జీతగాళ్లు, యితరకూలీలు వెంటనే సమ్మె ప్రారంభించారు. స్థానిక కమ్యూనిస్టులు ఈ సమ్మెవల్ల ఆహారోత్పత్తికి ఎంత భంగం వాటిల్లుతుందో గ్రహించారు. కూలీల కోర్కెలను చెల్లించ వలసిందని రైతులలో ప్రచారం చేశారు. రైతులు మొదట తిరస్కరించారు. తాలూకా రైతు సంఘాధ్యక్షుడు, ఏలూరు తాలూకా వ్యవసాయకూలీసంఘ ఆర్గనైజరు, చింతలపూడి కమ్యూనిస్టు వర్కర్లు, కలిసి వెళ్ళి ఉభయవర్గాలలోను అధికాహారోత్పత్తి యొక్క ప్రాధాన్యతను గురించి ప్రచారం చేశారు.

చివరకు ప్రచారం ఫలించింది. ఇక మీదట సరియైన మానికతోనే ధాన్యం కొలుచుటకు, జీతం రు. 24 కు పెంచుటకు, రైతు లంగీకరించారు. 7 రోజుల తరువాత సమ్మె అంతమయింది.

మునిసిపల్ కార్మికులకు రు. 10 లు అలవెన్సు ఇవ్వాలి

ఆంధ్రరాష్ట్ర మునిసిపల్ కార్మికుల సంఘం యొక్క ఆందోళన ఫలితంగా మదరాసు ప్రభుత్వం మున్సిపలు కార్మికులకు రు. 8-8-0లు కరువుభత్యము నిర్ణయిస్తూయీ మధ్యఒక ఆర్డరుచేసింది. బ్రాంచి సంఘాలు బాగా పనిచేస్తున్నచోట్ల యిది అమలు పెట్టబడింది. మిగతా చోట్ల మునిసిపాలిటీలుఅశ్రద్ధ వహిస్తూనేఉన్నాయి. బళ్ళారి, కర్నూలు, విజయనగరాల్లో రు. 8-8-0 ఆలవెన్సు అమలు జరుగలేదు. ఈ కరువుభత్యము పోయిన డిసెంబరు నెలనుంచి ఆచరణలో పెట్టాలని ప్రభుత్వ ప్రకటన తెలియజేసింది. బ్రాంచి సంఘాలన్నీ శ్రద్ధవహించి, కరువుభత్యము సరిగ్గాముట్టినదీ, లేనిదీచూడాలి. రాష్ట్రయూనియనుయొక్క నిర్మాణబలము, కృషి, మూలంగానేకరువుభత్యాన్ని ఒకరూపాయినుంచి నేడు రు. 8-8-0 కు పెంచగలిగాము. మొదట మనకృషికి అధికారులు పెట్టేఇబ్బందులన్నింటినీఎదుర్కొంటూ, దీనిని సాధించాం.

కాని, బ్రాంచి సంఘాలు కరువుభత్యము వచ్చేవరకు ఆందోళన చేశాయి. వచ్చిన తరువాత ఎప్పటినుంచి అమలులో పెడుతున్నదీ రాష్ట్రయూనియన్‌కు రిపోర్టులులేవు.

ప్రభుత్వ పనివారలకు రు. 8—8—0 కరువుభత్యం రేటు 6 నెలల క్రితం అమలు పెట్టబడింది. ఈ6నెలలలో జీవిత పరిమాణము పెరిగింది. అందువల్ల కేంద్ర ప్రభుత్వం రు. 11—8—0 కరువు భత్యం నిర్ణయించింది. కాని, మదరాసు ప్రభుత్వం రు. 10 లు మాత్రమే నిర్ణయంచేసింది. మునిసిపల్ కార్మికులకుకూడా కరువుభత్యం రు. 10 లు నిర్ణయించాలని అన్ని బ్రాంచి సంఘాలు ఆందోళన చెయ్యాలి.

బ్రాంచి సంఘాలన్నీ కార్మికులయొక్క జీవిత వ్యయము ఎంత ఎక్కువయిందో చూపిస్తూ, కార్మికులు అప్పుల పాలగుట వివరించి మార్చినుంచి రు. 10 లు అలవెన్సు అమలు పెట్టించాలని ఆందోళన చెయ్యాలి.

మునిసిపాలిటీలు డబ్బులేదని సాకులు చెప్పవచ్చు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే, మున్సిపల్ కార్మికులు తిండిలేక, జబ్బులపాలైతే పట్టణ పారిశుద్ధ్యానికి ఎంత ప్రమాదమో మునిసిపాలిటీలు గుర్తించాలి. డబ్బులేనిచో రాష్ట్రప్రభుత్వమునుంచి అప్పు తెచ్చి అధిక అలవెన్సు యివ్వాలి.

బ్రాంచిసంఘాలు రు. 10 లు కరువుభత్యం విషయమై మున్సిపల్ కౌన్సిలర్సు, కమిషనరు, చైర్మెన్‌ల మధ్య ప్రచారము చెయ్యాలి. మున్సిపల్ కౌన్సిలులో బ్రాంచి ప్రతినిధులుకరువుభత్యంయొక్క అవసరాన్ని గురించి మాట్లాడాలి.

పట్టణ ఆరోగ్యమును గురించి తమ కృషి తెలియజేస్తూ కార్మికులు ప్రజల సహకారాన్ని పొంది, యితర సంస్థల సానుభూతిని సంపాదించాలి.

ప్రతి వార్డులో మీటింగులు పెట్టి, తీర్మానాలుచేసి, మదరాసు ప్రభుత్వానికి, మునిసిపల్ అధికారులకు తెలియజెయ్యాలి.

సి. వి. కె. రావు.
ఆంధ్రరాష్ట్రమునిసిపల్‌వర్కర్సుయూనియన్ అధ్యక్షుడు.

★ బెంగాల్ నిధికి

సోవియట్ ఫిలిమ్సు ప్రదర్శన

"కజాకిస్థాన్", "స్వాతంత్ర్య యుద్ధంలో ఒక్కరోజు" అనే రెండు సోవియట్ ఫిల్ములు బెజవాడలో రెండు రోజుల్లో రు. 1028 లు బెంగాల్ నిధికి సంపాదించిపెట్టాయి. తెనాలి, గుంటూరు పట్టణాల్లో కూడా ఇవి తమవంతు కర్తవ్యాన్ని నెరవేర్చాయి. తెనాలిలో రెండాటలు వేశారు. చుట్టు ప్రక్కల గ్రామాలనుంచి తండోపతండాలుగా ప్రజలు వచ్చారు. మొత్తం 1500 మంది ఈచిత్రాన్ని చూచారు. రు. 878—4—0 వసూలయింది. గుంటూరులో మూడవ ఆట కూడా వేయవలసి వచ్చింది. 2500 మంది ప్రేక్షకులు వచ్చారు. రు. 1563-4-0 వసూలయింద. ఈవసూళ్ళను బెంగాల్ పీపుల్సు రిలీఫ్ కమిటీకి పంపారు.

సరస్వతీటాకీస్, గుంటూరు సత్యనారాయణటాకీస్ (తెనాలి) వారు తమహాల్సుని ఉచితంగాఇచ్చి, బెంగాల్ సోదరులపట్లసానుభూతిని వెల్లడిచేశారు. ప్రజలు, స్థానికాధికారులు, వీరి కృషిని అభినందించి, అన్నివిధాల తోడ్పడ్డారు. ఈకృషి కొనసాగిస్తూ వలంటీర్లు ప్రజలకు దేశపరిస్థితులను బోధించారు. బెంగాల్ స్థితిని వివరించి కరువునిధికి విజ్ఞప్తిచేశారు, రు. 6—7—5 లున్నూ, నైజాం డబ్బులు 0-2-1 వసూలు చేశారు.

తిరుణాలలో బెంగాలు నిధి

ఈ నెల 11, 12, 13 తేదీల్లో మాచెర్ల (గుంటూరుజిల్లా)లో చెన్నకేశవస్వామి తిరుణాలజరిగింది. తిరుణాలకువచ్చిన వేలాదిప్రజలకుఏలాంటి ఇబ్బందికలగకుండా చేయడానికి పల్నాడు రైతు, యువజన, వాలంటీర్లు కృషిచేశారు. పొరుగూళ్ళనుండివచ్చిన దుకాణదార్లకు కిరసనాయిల్ సప్లయి చేయించారు.

పెళ్ళికట్నాలు

మునిపల్లె శ్రీరాములుగారి (తెనాలి రజకపేట) వివాహ సందర్భంలో బెంగాల్ కరువు నిధికి విజ్ఞప్తిచేయగా 3-13-3 వసూలైంది.

వీరులపాడు (నందిగామ తాలూకా)లో ఒక వివాహంలో వధువు తరపున చావ కృష్ణయ్యగారు రు. 5 లు బెంగాల్ నిధికిచ్చారు.

గౌరంపాలెం (తిరువూరు తాలూకా)లో మొహమ్మద్‌సాలెహ తన పెండ్లి సందర్భంలో బెంగాలునిధికి రు. 2 లు విరాళమిచ్చారు.

రెడ్‌ఎయిడ్ నిధి

పల్నాడు తాలూకా కమ్యూనిస్టుపార్టీ జనరల్‌బాడీ సభలో బెంగాల్ కమ్యూనిస్టుల సహాయార్థం (రెడ్‌ఎయిడ్‌నిధికి) రు. 6-12-0 వసూలయింది. వీరులపాడులో (నందిగామ తాలూకా) మహిళాసంఘం రు. 17 లు, పార్టీసభ్యులు, సానుభూతిపరులు రు.27-4-0 ఈనిధికి విరాళాలిచ్చారు.

రష్యాజపాను ఒడంబడిక మిత్రరాజ్యాలకు లాభకరం

మార్చి 30 వ తేదీన సోవియటు యూనియన్‌కు-జపానుకూ మధ్య ఒడంబడిక జరిగింది. ఈ ఒడంబడిక మూలంగా ఉత్తర సఖాలిన్ దీవిలో (సఖాలిన్‌దీవి జపానుకు ఉత్తరంగా, సైబీరియాతీరాన ఉంది.) జపాను ఇదివరకు పొందిన బొగ్గు, నూనె సౌకర్యాలు ఇక ఉండవు. ఇంతేగాక 1928 నాటి ఫిషరీ కన్వెన్షన్ (పసిఫిక్ సముద్రంలో చేపలు పట్టుకొనె అధికారం)లో కూడ కొన్ని సవరణలు గావించబడినయి. ఈ ఒడంబడికవల్ల సోవియటు పొందిన లాభాలను వివరించేముందు, జపాను-సోవియటుల పరస్పర సంబంధాలనుగురించి కొన్ని వివరాలనుచూద్దాం.

జపాను వాగ్దానాలు

1941 ఏప్రిల్ 13 వ తేదీన సోవియటు-జపాను తాటస్థ్య ఒడంబడిక జరిగింది. తటస్థత అంటే కొన్ని సామ్రాజ్యవాద దేశాలలాగా ఆక్షరాజ్యాలను "సంతృప్తి" పరచడం గాదు. "మాకు ఇతరులభూమి ఒక అంగుళం వద్దు, కాని మాభూమిలో అడుగుపెట్టారా, ఖబడ్దార్!" ఇదీ సోవియటు విదేశ రాజనీతి. అందుచేతనే, సోవియటు-జర్మనీ తటస్థఒడంబడికవల్ల సోవియటు నష్టపడలేదు. అది చరిత్రయే రుజువుచేసింది ఆవిధంగానే సోవియటు-జపాను ఒడంబడికవల్లకూడా, సోవియటు లాభపడుతోంది.

ఈ తటస్థ ఒడంబడిక జరిగిననపుడు, జపాను విదేశాంగమంత్రి మట్సుఓకా మాలటావ్‌కు వ్రాసినలేఖలో ఉత్తర సఖాలిన్‌లో తాము పొందిన హక్కులను (కన్సెషన్సు) కొన్ని నెలలలోనే రద్దుచేసి ఆ విషయం పరిష్కరించుతామని అన్నాడు. దీనినే తిరిగి 1941 మేలో మాస్కోలోని జపాను రాయబారి టాటొకెవా ద్వారా తెలియజేస్తూ ఆరు నెలలలోగా ఈవిషయం తప్పక పరిష్కరించుతామని అన్నాడు.

దానినిబట్టి, 1941 అక్టోబరులోనే, జపాను ఉత్తర సఖాలిన్‌లోని తన హక్కులను రద్దు చేసికోవలసియుంది. కాని జపాను అలా చేయలేదు. కారణం అందరికీ తెలిసిందే.

హిట్లరుపై ఆశ

1941 జూన్‌లో జర్మనీ సోవియటుపై యుద్ధం ప్రకటించింది. "ఇజ్వెస్టియా" చెప్పినట్లు, హిట్లరు మెరుపుయుద్ధం(బ్లిట్స్‌క్రీగ్)లో జపాను రాజకీయవేత్తలు చాలమంది ఆశలు పెట్టుకొన్నారు. జర్మనీ జయించుతుందని ఆశించారు. తమ వాగ్దానాల్ని ఆచరణలో పెట్టవలసినరోజు వస్తుందని జపాను ఊహించలేదు.

కాని జపాను ఆశలు అడుగంటాయి. జపాను కళ్లుతెరవడానికి కొంతకాలంపట్టింది. రెడ్‌ఆర్మీ స్టాలిన్‌గ్రాడ్‌వద్ద హిట్లరు నోడించి, జపాన్ జర్మనీలు ఇండియాలో కలియాలనే ఆశను భగ్నపరచింది. ఇపుడు నాజీ సైన్యాలకు తీవ్ర అపజయాలను కలుగజేస్తూవుంది.

అందుచే జపాను తిరిగి రాయబారాలు ప్రారంభించి, మార్చి 30 వ తేదీన ఒడంబడికకు వచ్చింది. ఈ ఒడంబడిక షరతులేమిటి?

ఉత్తర సఖాలిన్ దీవిలో జపానుకీయబడిన హక్కులన్నీ రద్దుచేయి బడతాయి. అంతేగాక, అక్కడఉండే ఆస్తిపాస్తులన్నీ సోవియట్‌కు ఒప్పజెప్పాలి. (అంటే, యంత్రాలు, పరిశ్రమలు, విడిసామాను, రవాణాసాధనాలు మొదలైనవి) మార్చి 15-20 తేదీల మధ్య రాయబారాలు జరిగే కాలంలోనే జపాను అలా ఒప్పజెప్పింది కూడా.

దీనితోపాటు 1928 లోని చేపల పట్టుకునే ఒడంబడిక మరి 5 సంవత్సరాలు పొడిగించింది. కాని, సోవియటు ప్రభుత్వ సూచన ప్రకారం ఒడంబడికలో కొన్ని మార్పులు జరిగాయి. వాటిలో ముఖ్యమైనవి:

1. 1928 ఒడంబడికలో సోవియటు ప్రజలపైన, సంస్థలపైన విధించిన విషేధాలన్నీ రద్దుచేయాలి.

2. ఈ యుద్ధం అంతం అయ్యేవరకు జపాను దేశస్థులుగాని, ఇతర విదేశవాసులుగాని, 1941 జులై 12 వ తేదీన సోవియటు ప్రభుత్వం నిర్ధారణచేసినట్లుగా పసిఫిక్‌సముద్రంలోని నిశ్చితప్రదేశాలలో చేపలుపట్టరాదు.

3. కామ్‌చట్కా తూర్పు తీరంలోను, ఒల్యూటార్స్కి ప్రదేశంలోను, (జపాను కవులుకు ఈ ప్రాంతాలను తీసుకొన్నది) పసిఫిక్‌లో యుద్ధం అంతం అయ్యేవరకు చేపలు పట్టకూడదని జపాను హామీ ఈయాలి.

ఒడంబడిక సారాంశం

ఈ షరతులన్నీ సోవియటు సూచనపై అంగీకరించబడినాయి. అంటే అర్థమేమిటి? గత మూడేండ్లలోను సోవియటు బలం ఎంత వృద్ధిఅయిందో తెలియజేస్తుంది. పసిఫిక్ యుద్ధం అంతం అయ్యేవరకు చేపలు పట్టరాదనీ ప్రస్తుత యుద్ధసమాప్తి అయేవరకు నూనెగాని, బొగ్గుగాని సప్లయిచేయమనీ, సోవియటు అనుటలో, ఈ ఒడంబడికలో పైచేయి ఎవరిదో స్పష్టంగా తెలుస్తూనే వుంది. సోవియటు చెప్పినదానికల్లా తల ఊగించే పరిస్థితికి జపాను వచ్చింది. ఈ విషయాన్నే చెబుతూ "ఇజ్వెస్టియా" ఇలా వ్రాసింది: "పసిఫిక్ యుద్ధంలోని ప్రత్యేక పరిస్థితులనుగూడా సోవియటు ఆలోచించింది. ఎందువల్లనంటే, అవి మామిత్రరాజ్యాలకుగూడా సంబంధించి వుంటవి గనుక." ముఖ్యంగా చివరి వాక్యం గమనించాలి. ఈఒడంబడికద్వారా పసిఫిక్‌లో జపానును బలపరచి జపాను ఫాసిజాన్ని ఓడించుటలో మిత్రరాజ్యాలకు సహాయపడుతోంది.

అందుకనే ఈ ఒడంబడిక తమకుకూడ విజయంగా ఆంగ్లో-అమెరికన్ పత్రికలు శ్లాఘించుతున్నాయి. ఉదాహరణకు చికాగో "సన్" పత్రిక, సఖాలిన్‌లో జపానుకిచ్చిన సౌకర్యాలను రద్దుచేయడం మిత్రరాజ్యాల విజయసాధనకి ఒకమెట్టు అంటూ ఇలాఅంది. "జపానుకు కావలసిన యుద్ధ పరికరాలూ, ఆహారమూ ఈ ఒడంబడికవల్ల తగ్గిపోతున్నాయి. ఇంతేగాక జపాను ప్రతిష్ఠకు ఇది పెద్ద దెబ్బ."

ఇంత స్పష్టంగా ఈ ఒడంబడికను మిత్రరాజ్యాలు శ్లాఘించుతున్నా, కందకులేనిదురద కత్తిపీట కన్నట్లు, మన పత్రికలు కొన్ని కావాలనో, అజ్ఞానంవల్లనో, ఇది మిత్రరాజ్యాలకు నష్టమనీ ఇంకా ఏమేమో వ్రాశాయి. వాటి నిందలను పరిశీలించుదాం.

సోవియటుదే పైచేయి

ఈ ఒడంబడిక మూలంగా జపాను - సోవియట్ల స్నేహం (మిగతా 10 వ పేజీలో)

అఖిలభారత రైతుమహాసభ జమాఖర్చుల నివేదిక

ప్రజాశక్తి 19—4—44 సంచికలో లెక్కలు, చిఠావద్దులు ప్రకటించాం. దానిని బట్టి ప్రజలకు మహాసభ ఖర్చులు సరిగా అర్థం కాకపోవచ్చు. అందుచే వానిని సవరించి జమాఖర్చులు ప్రకటిస్తున్నాం.

1. గత వారం ప్రకటించిన లెక్కలలో చింతపండు, బెల్లం వగైరా, కట్టెపుల్లలు బియ్యం, టాటాకు ఇతరముల పద్దుల మొత్తం రు. 14381—4—0 విరాళములుగా వచ్చినవి కావు. మహాసభకు కొన్న సరుకులో మిగిలిపోయిన దానిని వాపసుచేయగా వచ్చిన డబ్బు. దీనిని ఆయా ఖాతాలనుండి తగ్గించి చూపెట్టవలసింది.

2. కూరగాయలు, పచ్చళ్ళు, మజ్జిగ, కట్టెపుల్లలు, కొన్ని ఉచితంగా రాబట్టి భోజనపు ఖర్చులు రు. 14466—3—4 మాత్రమే అయినవి: లేనిచో, మరి రెండు, మూడు వేలు ఎక్కువయ్యేవి. చాలా టాటాకు ఉచితంగా రాబట్టి పందిళ్ళు రు. 5540/- లతో పూర్తి అయ్యాయి: లేనిచో, వాటికికూడా మరొక రు. 1000/- లు ఎక్కువ అయ్యేవి.

3. జిల్లాసంఘాలకు ప్రచారపు ఖర్చులు అని వ్రాసినది ఈవరకైన ఖర్చులు కావు. డబ్బు వసూళ్ళకు ముందు, జిల్లా రైతుసంఘాలకు ఇచ్చిన వాగ్దానం ప్రకారం, రైతుసంఘాల కార్యనిర్వాహణకుగాను, మిగిలిన సొమ్మునుండి ఇచ్చిన గ్రాంటులు. ఈగ్రాంటు జిల్లా రైతు సంఘాలు వసూలు చేసిన మొత్తంలో నాలుగవ వంతు. అంటే రు. 19409—5—4.

4 రైతుమహాసభకు రొక్కవిరాళాలు, స్టాల్సుఅద్దెలద్వారా, వచ్చిన రు. 77764-10-8 లలో ఖర్చులు రు. 41929—1—1 లు పోను, రు. 35835—9—7 లు మిగిలినది. దీనిలోనుండి జిల్లా రైతుసంఘాలకిచ్చినది రు. 19409—5—4 పోను మిగతా రు. 16426-4-3 ఆంధ్రరాష్ట్ర రైతుసంఘ పరంగా ఉంచబడింది.

జమలు

జిల్లాలనుండివచ్చిన విరాళాలు	77369	10	8
స్టాల్సుఅద్దె	395	0	0
	77764	10	8

ఖర్చులు

భోజనములకు	14466	3	4
పందిళ్ళనిర్మాణం	5540	0	6
నీటి సరఫరా	2860	9	6
ఆరోగ్యప్రదర్శనం, శానిటేషన్, హాస్పిటల్	776	7	6
ప్రజారక్షణదళం తర్ఫీదు, జెండాలు, బాడ్జీలు వగయిరా	3320	7	4
ఎలక్ట్రిసిటీ వగైరా	2668	13	0
కూలి, బండ్లబాడుగలు వగైరా	1045	9	6
అగ్నిమాపక యేర్పాట్లకు	918	2	0
పత్రికలు, ప్రచారపుఖర్చులు	1181	5	9
పోస్టేజి, టెలిగ్రాములు	219	9	3
ఆఫీసు, ఫర్నిచరు, స్టేషనరీ	898	5	9
చాపలు	724	5	6
ప్రింటింగు	907	10	6
ప్రయాణములకు	1316	10	3
వైజ్ఞానికదళాలు	1103	10	11
పశుప్రదర్శనం బహుమతులు	1006	14	0
బెంగాల్ కరువునివారణకువిరాళం	1000	0	0
అప్పులు	595	0	0
ఇతర విధములగు ఖర్చులు	1379	4	6
మొత్తం ఖర్చులు	41929	1	1
మిగిలినది	35835	9	7
	77764	10	8

మిగిలినడబ్బులోనుండి			
జిల్లాలకు గ్రాంటులు	19409	5	4
ఆంధ్రరాష్ట్ర రైతుసంఘానికి అందజేసినది	16426	4	3
	35835	9	7

నండూరి ప్రసాదరావు,
ఆహ్వానసంఘ కార్యదర్శి.

జాతీయవారం

పుణ్యభారతభూమిపై శత్రు మూకలు అడుగుపెట్టాయి. తూర్పుబెంగాల్లోని జీవనాడులకు ఎగబడుతున్నాయి. కరువుకాటకాలతో మాడుతూన్న అస్సాం, బెంగాల్ సోదరులను సునాయాసంగా కబళించవచ్చునని గుటకలు వేస్తున్నాయి. ఇలాంటి ఆపద సమయంలో మనజాతీయవారం గడిచింది.

ఎక్కడచూచినా, ఏ సభలోవిన్నా దేశరక్షణకొరకు ఆందోళన శతవిధాల వెల్లడయింది. కాకినాడలో ఆరవతేదీ మొదలు 13 వ తేదీవరకు ఉదయాన పేటపేటల్లో ప్రచారం జరిగింది. కృష్ణాజిల్లాలో చిగురుకోట, నరసన్నపాలెం, అయ్యవారిరుద్రవరం, ములగలపల్లి (కైకలూరు తాలూకా,) పురుషోత్తమపట్నం, కట్టుబడిపాలెం, ముస్తాబాద, సున్న (గన్నవరం తాలూకా), పెదన, కప్పలదొడ్డి, లేళ్ళగరువు, ముచ్చెర్ల, చిన్నాపురం, బందరు (బందరు తాలూకా), కొణతమాత్మకూరు (నందిగామ), గంపలగూడెం (తిరువూరు) మొదలయిన ప్రాంతాల్లోజాతీయవారంజరిగింది. కాంగ్రెసు-లీగులమధ్యఐక్యత నిర్మించి, జాతీయనాయకుల విడుదల, జాతీయప్రభుత్వ స్థాపన సాధించి, శత్రుమూకలను హతమార్చడానికి శక్తివంచన లేకుండా కృషిచేయడానికి అన్నిచోట్ల దీక్షబూనారు. కరువురాక్షసి నెదుర్కొని, సోదరప్రజల మనోనిబ్బరాన్ని కాపాడ ప్రతిజ్ఞ తీసుకున్నారు.

పీపుల్సు పబ్లిషింగు హౌసు క్యాలెండర్లు

కొద్దిగామాత్రమే వున్నాయి. కావలిస్తే వెంటనే ఆర్డర్లు ప్రజాశక్తి కార్యాలయానికి పంపండి. వెల 0—8—0

ప్రజాశక్తి ప్రచురణశాఖ

పెళ్లిఆచారాల్లో మార్పు

ఈ నెల 4 వ తేదీని రాజమంద్రి మునిసిపల్ వర్కర్సు యూనియన్ ఆఫీసులో కులపెద్దలు భూపతిగురవయ్య (బెజవాడ,) ముత్యాల వెంకటస్వామి (రాజమంద్రి) అధ్వర్యాన కె. పోతురాజుకు, బి. నరసమ్మకు ఆదర్శనీయమైన ప్రేమ వివాహం జరిగింది. వరుడుది బెజవాడ, వధువుది రాజమంద్రి. ఈ వుభయులు మునిసిపాలిటీలలో పనిచేయు కార్మికులే. ఈ వివాహం దాదాపు ఒకసంవత్సరం క్రితమే వీరిద్దరూ నిర్ణయించుకున్నారు. కాని వీరి కులాచారాల ప్రకారం యిట్టి నిర్ణయం తప్పుగా పరిగణించడం సాంప్రదాయం. కులపెద్దల అనుమతిలేనిదే యువకులు, యువతులు నేరుగా ప్రేమనిర్ణయాలకు దిగకూడదు. దీన్ని వుల్లంఘించినట్లయితే కులపెద్దల కఠిన చర్యలకు గురికావలసి వస్తుంది. వుదాహరణకు ఒక రెల్లి యువకుడు ఒకరెల్లియువతిని ప్రేమించాడనుకుందాం. ముందు వారుభయులు వారికులపెద్దలను లాంచనాలతో మంచి చేసుకోవాలి. అప్పుడు వీరిప్రేమను వారుఅంగీకరిస్తారు. లేకపోతే కులపెద్దలుఒప్పుకోరు. వారు ఒప్పుకోనిచో పెళ్ళిజరుగనేరదు. అందుచేతపెళ్లి కాకుండా వుభయులు కలిసివెళ్ళిపోవడం సంభవిస్తుంది. ఈ విధంగా వెళ్ళినవారికి కులపెద్దలు రు 30 లగాయుతు రు 50 వరకు కులతప్పు విధిస్తారు. ఈ మొత్తం వెంటనే చెల్లించలేనిచో కులంనుండి దూరం చేస్తారు. ఇక కులాచారాల ప్రకారం పెళ్ళిజరపడానికి కనీసం 300రూపాయలు వుండాలి. 3 రోజులు పెళ్ళి జరగాలి. ప్రతిపెళ్ళికి రు. 50 ల వరకు కులపెద్దల మామూళ్లు. 3 రోజులూ తాగినంత కల్లు, జలసా, పందులనుచంపడం, మొదలగు రాక్షసపద్ధతులతో జరపాలి. తాహతులేకపోయినా పై పద్ధతుల ప్రకారం వరుడు రు. 300 లు వధువు రు. 250 లు అప్పుచేసి ఐనా వివాహం చేసుకోవాలి.

ఈ నిర్బంధ విధానంవల్ల ఎన్నోకుటుంబాలు పెళ్ళి అప్పులు తీర్చలేని దుర్భర పరిస్థితులలో కుమిలిపోతున్నాయి.

ఇట్టి దురాచార పరిస్థితులనుండి మొత్తం రెల్లి కులాన్ని బాగుపర్చుటకు యువకులు, మహిళలు నడుములుబిగించి, నూతన మార్గాన్ననుసరించారు. రాజమంద్రి, బెజవాడ కులపెద్దలకు, వివాహాల విషయంలో ఎన్నో ఉదాహరణలతో చెప్పి పై కామ్రేడ్ పెళ్ళికి ఒప్పించడమైనది. పురాతన రాక్షస ఆచారాలను కులపెద్దలు నిరసించారు. ఈ పెళ్ళి ఒక్కటేకాక యికముందు అన్ని పెళ్ళిళ్లు కూడా వారి తాహతునుబట్టి స్వల్ప డబ్బుతో జరగాలని, కుల కట్నాలు, పందులు, త్రాగుడు ఈ రోజుతో మానుకుంటున్నామని, కులపెద్దలంతా హృదయ పూర్వకంగా హామీ యిచ్చారు.

కామ్రేడ్, కె. పోతరాజు, బి. నరసమ్మ వివాహం, వారి తాహతునుబట్టి ఒక్కరోజులో నిరాడంబరంగానూ, ఆదర్శంగానూ రెల్లి కులంలో నూతన సాంప్రదాయంగాను, పైపెద్దల అధ్వర్యాన జరిగింది. ఈ వివాహానికి బెజవాడ యువకులు, మహిళలు, పెద్దలు 20 మంది, రాజమంద్రివారు షుమారు 200 మంది హాజరయి జయప్రదంగా జరిపారు. జాతీయ గీతాలతోనూ, నినాదాలతోనూ, వూరేగింపుకూడా జరిగింది. ఈ వివాహాన్ని రెల్లికులం వారేగాక యింకావెనుకబడిన జాతులవారు కూడా యికముందు అంతా యీ విధంగా స్వల్పఖర్చులతో వివాహాలు చేసుకోవడంమంచిదని తమ అభిప్రాయాలు యిచ్చారు.

హిందుస్తానీ ప్రచారక శిక్షణ శిబిరం

ఈ శిబిరము మేనెల 10 వ తేదీనుండి ఒకమాసమురోజులు కొమరవోలు, శ్రీ గాంధీ అశ్రమములో, కృష్ణా జిల్లా హిందుస్తానీ ప్రచారకమండలి యాజమాన్యమున నడుపుటకు నిశ్చయింపబడినది.

ఈ శిబిరములో ప్రచారకులు, హిందీ భాషలో ధారాళముగా ఉపన్యాసము లొసంగుట, నవీనబోధనాపద్ధతులు, హిందీవ్యాసరచన, ఉర్దులిపి మొదలగునవి అభ్యసించుటకేగాక, ధార్మిక, ఆర్థిక, సాంఘిక, వైజ్ఞానిక, సాహిత్యకాది విషయములపై పండితులొసంగు హిందీ తెలుగు మహోపన్యాసములు విను అవకాశమునైతము లభించును. శ్రీ వ్రజనందన శర్మగారు శిబిరపతిగా నుండ దయతో అంగీకరించిరి.

శ్రీ విశ్వనాధ సత్యనారాయణ, పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు, జీ. వీ. కృష్ణారావు, గొర్తి వెంకటరావు, కొమాండూరి శఠకోపాచార్యులు, కంభంపాటి సత్యనారాయణ, చెరుకువాడ వెంకటనరసింహం, కాశీపట్నం కొండయ్య, ప్రభృతులు శిబిరమునకువచ్చి, విజ్ఞానము, చరిత్ర, సాహిత్యము, సంస్కృతి, లలితకళలు, జాతీయభాష, మాతృభాషలు, సహకారోద్యమము మొదలగువిషయములపై ఉపన్యసించుటకు దయతో అంగీకరించిరి. హిందీభాషావిద్వాంసులు శ్రీజైనేంద్రకుమార్, శ్రీ భదంత ఆనంద కౌశల్యాయన్, గార్లను పిలిపించుటకు ప్రయత్నములుజరుగుచున్నవి.

కనుక యీ శిబిరములో ప్రవేశించదలచిన హిందీ - హిందుస్తానీ ప్రచారకులును, ఉపాధ్యాయులును వెంటనే "శ్రీ గన్నే వెంకటేశ్వరరావుగారు, కార్యదర్శి, కృష్ణాజిల్లా హిందూస్తానీ ప్రచారక మండలి, గన్నవరం (కృష్ణాజిల్లా)" అను చిరునామాకు దరఖాస్తులు పంపవలెను. ఇతరవివరములుతెలియగోరువారుకార్యదర్శి పేర వ్రాయగోరెదను.

ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య,
కార్యదర్శి,
ఆంధ్రరాష్ట్ర హిందీప్రచారకసంఘం, బెజవాడ

మృతుదేవతనుండి మీసోదరులను కాపాడండి!

— డాక్టరు బి. సి. రాయ్

ఒక ఏడాదిపాటు చావుబ్రతుకుల మధ్య కొట్టుకులాడిందిబెంగాల్. జాడ్యాల మహామారి పంద్రెడు నెలలనుంచి బెంగాల్ ప్రజలతో చెలగాటమాడుతూంది. భారత దేశంలోను, విదేశాల్లోనూ బెంగాల్ విషాదగాధకు లక్షలకొలది గుండెలు కరిగిపోయాయి. చేరిన సహాయ సానుభూతు లపారము.

ఈమధ్య కొందరు జోస్యులు బయలుదేరారు - కష్టాలన్నీ గట్టెక్కిపోయాయని చెప్పుకుంటూ. ఈతప్పుడు ప్రచారంఫలితంగా అనవసరప్రమత్తత బాగా వ్యాపించింది. కాని ప్రమాదం ఏమాత్రం తొలగలేదు. నిజానికి, ఆనాడుకరువురాక్షసికన్నా ఎంతోయెక్కువగ ఈనాడు జాడ్యాల పెనుభూతం ప్రజల్ని పొట్టబెట్టుకుంటూంది. సానుభూతి సహకారాలకు మునుపటికన్నా ఎంతో ఎక్కువ ఆవసరం ఉంది. ఇదివరకు ఎంత సహాయం చేసినప్పటికీ, మనపైని ఇంకా సహాయంచేయవలసిన బాధ్యత చాలా ఉంది.

క్రమపద్ధతి అవసరం

ఎక్కువ సహాయం చేయడం మాత్రమే గాదు కావలసింది. బెంగాల్ ప్రజల అవసరాల్లో ఏ ప్రాంతం దేనిని ఎక్కువగా తీర్చగలదో గ్రహించి, క్రమపద్ధతులపై ఈ సహకారం సాగాలి. ముఖ్యంగా మందుల విషయంలో ఇదెంతో అవసరం. మందులు చాలినంత లేవు. వున్నవాటిని సరఫరా చేయడంలో, అధికారుల అవకతవకలవల్ల ఎంతో వ్యర్థమవుతూంది.

మరో ముఖ్య విషయం. మనం ఎదుర్కోవలసిన సమస్య చాలపెద్దది. ఏసంస్థకాసంస్థే తన శక్తికొద్దీ పనిచేస్తానంటే లాభం వుండదు. అంతా ఏకమై, తమశక్తినంతట్నీ కూడగట్టి, పరిస్థితుల నెదుర్కోవాలి. అప్పుడే చక్కని సమన్వయం కుదరగలదు.

ఐక్య కమిటీ

ఈ పరిస్థితుల నన్నిటిని ఆలోచించి, ప్రముఖ వైద్యులు, వైద్య సహాయం చేస్తున్న సంస్థలు, కలిసి "బెంగాల్ వైద్య సహాయక సంఘాల ఐక్యకమిటీ"ని ఏర్పాటు చేశారు. దీనితో సహకారం చేయడానికి అనేక సంస్థలు ముందుకొచ్చాయి. పీపుల్సు రిలీఫ్ కమిటీ, బెంగాల్ మహిళా ఆత్మరక్షసమితి, అఖిలభారత మహిళా మహాసభ సహాయక సంఘం, బెంగాల్ రాష్ట్రీ ముస్లిం లీగ్ సహాయక సంఘం, బెంగాల్ రాష్ట్ర హిందూ మహాసభ సహాయక సంఘం, బెంగాల్ రిలీఫ్ కమిటీ, మొదలైన 16 సహాయక సంఘాల ప్రతినిధులు ఈ కమిటీలో ఉన్నారు.

ఏయే ప్రదేశాల్లో, ఎలాంటి జాడ్యాలు చెలరేగుతున్నాయో కనిపెట్టి, తగిన వైద్య సామగ్రితో వైద్యసహాయక దళాలను అక్కడికి పంపడం ఈ కమిటీపని. ఒక ప్రదేశంలో వైద్యసహాయక దళాన్నొకటుంచి మూడు నెలలు పనిచేయాలంటే రు 2500లు ఖర్చవుతుందని లెక్కతేలింది. ఈ కమిటీ అధ్వర్యాన జరిగే కృషి నంతటినీ అప్పుడప్పుడు తనిఖీచేస్తుంటారు.

కమిటీ బాధ్యతలు

జాడ్యాలనుఅరికట్టడానికి ప్రభుత్వం కొన్ని ప్లాన్లువేసింది. ఈ చర్య మెచ్చుకోవలసిందే. కాని ప్రభుత్వప్లాన్లు ఎందుకూ సరిపోవు. ప్రభుత్వ సన్నాహాలతో, ఇతర ప్రజాసంస్థల కృషి ఎక్కువగా తోడ్పకపోతే ఇప్పటి భయంకర స్థితిని అరికట్టలేము. అందువల్ల అధికార, అనధికార, కృషిఅంతా ఏకముఖంగా సాగడం అత్యవసరం. 'బెంగాల్ వైద్య సహాయిక సంస్థల ఐక్యకమిటీ, దీనిని సాధించేబాధ్యత వహించింది. ప్రతి సంస్థయొక్క కార్యక్రమాన్ని ఇది నిర్ణయిస్తుంది. ఎక్కువగా జాడ్యాల వాతబడ్డ ప్రదేశాలకు ఇంకా ఎక్కువ వైద్యసహాయకదళాలను పంపుతుంది. నిర్ణీత సూత్రాల ననుసరించి కొత్త దళాలను తయారుచేస్తుంది. ఈ దళాలన్నిటికీ సరిపడే మందులు, వైద్యపరికరాలు కావాలి. కార్యక్రమం అంతా నెరవేరాలంటే ఉత్సాహవంతులు, మందులు, డబ్బు వెంటనేకావాలి.

విజ్ఞప్తి

—వివిధసంస్థలకు, ప్రముఖులకు మా విజ్ఞప్తి - మీరు చేయగల సహాయం అంతా చేయండి; మీరిచ్చే ప్రతిపైసా, జాడ్యాల బారినుండి ప్రజల్ని కాపాడ్డానికి ఎంతో తోడ్పడుతుంది.

— మందుల వ్యాపారస్థులకు మా వినతి— ఎంత ఎక్కువగా మందులను విరాళంగా ఇవ్వగలుగుతారో అంత ఎక్కువగా పంపండి.

—వైద్యవృత్తిలోఉన్న సోదరులకు మనవి - చావుబ్రతుకులమధ్య కొట్లాడుతున్న అభాగ్యుల ఆక్రందనలు వినండి; వలంటీర్లుగావచ్చి తోడ్పడండి. వైద్యసహాయక దళాల్లో పనిచేయడానికి వచ్చే డాక్టర్లకు జీతాలిస్తాం.

—విద్యార్థులకు యువకులకు, మాకృషికి తోడ్పడ ప్రార్థన.

—సోదరీమణులు నర్సులుగావచ్చిచేరాలి.

జాతి, మత, వర్గ, విచక్షణలేకుండా అందరికీ అందజేస్తున్నాం ఈ విజ్ఞప్తిని. స్వర్ణబెంగాల్ మీద ప్రళయనృత్యం సాగిస్తున్న మృత్యుదేవత ఈ విభేదాలనేమీ పాటించడం లేదు. అందరినీ ఒక్కరీతిగా పొట్టబెట్టుకొంటూంది. దానిని జయప్రదంగా ఎదుర్కోవాలంటే మనమంతా ఏకంకావాలి. బెంగాలులో వివిధతరగతులవారు, వివిధ రాజకీయాభిప్రాయాలవారు, తోడి మానవుల ఆక్రందనలు విని సానుభూతితో, ఏకముఖంగా ముందుకొచ్చారు. ఇటీవల బెంగాల్ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఇతరులుకూడా మాయందు విశ్వాసం ఉంచాలి.—శక్తివంచన లేక మాకృషికి తోడ్పడాలి.

ఈ చెట్టునీడనే....

— శ్రీ కొనకళ్ళ వెంకటరత్నం

ఈచెట్టునీడనే
ఇంకిపోదామోయి;
ఎందుకీ తిరిసెంపువేట?
ఓమామ,
ఎందాక ఈదేవులాట?

●

మేడకాదోయి అది;
వాడకాదోయి ఇది;
కటికిగుండెలు తాచి
కట్టుకొన్నా కోట
ఈచెట్టు........

●

కొలుకుల్లప్రాణాలు
వాలికిపోయేబిడ్డ
తుదిముద్దయినలేక
తూలిపోవక మున్నె,
ఈచెట్టు........

●

తెల్లదొరలంటావు
తిప్పలకు మూలము;
పొరుగింటి కలవాడె
పెట్టదేలా భిక్ష?
ఈచెట్టు........

●

నరరక్తమున వేరు
నాటుకొన్న దురాశ
పంటకెరు వైరాలు
వంతు మన దీనాడు;
ఈచెట్టు........

బాలబాలికలకు

మీకు బాలసంఘంవున్నట్లే చైనాలోకూడ బాలసంఘంవుంది. ఆ బాలసంఘం పేరు "సియాఊకుయే." బాలసంఘసభ్యులు ఎప్పుడూ చైనాఎర్రసైన్యాలకు తోడ్పడుతూవుంటారు. తమ ప్రాణంకన్నా తమదేశం ఎక్కువ అని భావించుతారు.

ఇప్పుడు మన మణిపూరుపై దండెత్తిన జపాను రాక్షసులే ఇదివరలో చైనాపైదండెత్తారు అలాదండెత్తిన శత్రువురహస్యాలను తెలిసికొని బాలసంఘ సభ్యులు ఎర్రసైన్యానికి సహాయపడేవారు. ఇదేమంత సులభమైన పనికాదు. ఇలాచేస్తుండగా పట్టుబడిన బాలసంఘ సభ్యులను చాలామందిని జపానువాళ్లు చంపేశారు. అయినా మన చైనా బాలవీరులు భయపడేవారుకాదు.

మనదేశంలో ఇపుడు వివిధజాతులమధ్య — ముఖ్యంగా ప్రధాన రాజకీయ సంస్థలైన కాంగ్రెసు — లీగుల మధ్య ఐక్యతలేదు. ఐక్యత లేకపోవడం వల్ల బ్రిటిషువాళ్లు మన నెత్తిన కూర్చుంటున్నారు, ఐక్యతలేకపోవడంవల్ల జపానువాడికి మన సరిహద్దులలో చొరబడే గుండెధైర్యం వచ్చింది. అందుకనే మనదేశంలో కమ్యూనిస్టులు ఐక్యత కావాలని ఘోషిస్తున్నారు.

మనదేశంలోనేగాదు. చైనాదేశంలోకూడ ఇదివరకు ఐక్యతవుండేదికాదు. చైనాలో చంగ్-కే-షెక్ ప్రభుత్వం కమ్యూనిస్టులతో పోరాడుతుండేది. 7 సంవత్సరాలక్రితం, ఈప్రభుత్వం కమ్యూనిస్టులపైన దండయాత్ర చేస్తుండేది. కమ్యూనిస్టులు ఈప్రభుత్వంతో "మీరు పోట్లాడవలసింది మాతోకాదు. మనయిద్దరిపైన, మన ఇద్దరి దేశంపైన, దండెత్తిన జపానుపైనపోట్లాడాలి." అని చెప్పేవారు. కాని అదివినలా.

ఆరోజుల్లో బాలసంఘ సభ్యులు ప్రతిగ్రామంలో ఆటపాటలద్వారా "జపానుకు వ్యతిరేకంగా ఏకంగండి" అని ప్రచారం చేసేవారు.

ఒకసారి ఒకగ్రామాన్ని కమ్యూనిస్టు సైన్యాలు విడిచిపెట్టి పోవలసివచ్చింది. ఆ వూళ్లో బాలసంఘసభ్యుడు వెనకబడిపోయాడు. బాలసంఘసభ్యులు కమ్యూనిస్టులని తెలిస్తే జపానువాళ్లేగాక, కుమిన్‌టాంగ్ ప్రభుత్వంకూడా వూరుకొనేదికాదు. ఒక ముసలమ్మ ఈ కుర్రాణ్ణి దాచడానికి ప్రయత్నించినా లాభంలేకపోయింది. ఇతని జేబులో ఎర్రనక్షత్రపుగుర్తువున్న బాలసంఘం టోపీవుంది. అందుకని పట్టుబడ్డాడు.

పట్టుకొన్న సైనికులు "నీవు రాజద్రోహివి. బందిపోటువు" అని అరిచారు. అతడు "నేను దొంగను కాదు. జపానువాళ్ళు దొంగలు. వాళ్ళు మనదేశం దొంగిలిస్తున్నారు. నేను బాలసంఘసభ్యుణ్ణి. నేను చెప్పేదేమంటే, మనలో మనకి తగాదాలు వద్దు. జపానువాణ్ణి మనం అంతాగలిసి తందాం అని జవాబిచ్చాడు."

ప్రభుత్వ సైనికాధ్యక్షుడికి ఈమాటలు నచ్చలా. మండిపడుతూ "వాణ్ణి కాల్చివేయండి" అని అన్నాడు.

మన బాలవీరుడు ఏమన్నాడో తెలుసా. "నన్ను చంపితే ఒకగుండు వృధాగా నష్టపవుతుంది. ఆగుండుతో జపానువాణ్ణి చంపవచ్చు."

ఈ మాటలకు అచటి సైనికుల హృదయం కరిగింది. తమ సైన్యాధ్యక్షునితో ఇలా అన్నారు. "ఇతడు చెప్పేది నిజం. మనలో మనం కొట్లాడుకోగూడదు. జపానువాణ్ణి తరమాలి. కుర్రవాడిని కాల్చం."

చూచారా చైనా బాలవీరుని దేశభక్తి! అతడు చివరి కెలాగో తప్పించుకుపోయాడుకూడా!

— దొడ్డమ్మ

కృష్ణాజిల్లా ప్రజాఆహార కమిటీ సమావేశం

పై సమావేశం 13-4-44 న బెజవాడలో జనాబ్ అలీబేగ్, ఎం. ఎల్. ఎ. గారి అధ్యక్షత క్రింద సమావేశమయింది. జిల్లాలో తరుగు ప్రాంతాలను సరిపడ్డ ధాన్యాన్ని మాత్రమే ప్రభుత్వం మిగులు ప్రాంతాలలో కొని నిల్వచేయాలనీ; ఇలా నిల్వచేయగలిగిన ధాన్యాన్ని మాత్రమే జిల్లా వెలుపలికి ఎగుమతి చేయాలనీ, కోరుతూ తీర్మానాలు జరిగాయి. పట్టణాలలో ప్రవేశపెట్టబడు రేషనింగు స్కీమును జయప్రదంగానిర్వహించుటకు ప్రజా అహారకమిటీల సహకారం తీసుకోవలసిందని కోరుతూ మరొక తీర్మానం గావించబడింది.

రేషనింగువల్ల ప్రజలందరికీ కంట్రోల్ రేటు ప్రకారం విధిగా అహారపదార్థాలు దొరుకుతాయనే హామీ ఉంటుంది. కాబట్టి, ఆస్కీమును పట్టణ ప్రజలందరూ బలపరచ వలసిందని హెచ్చరిస్తూ మరొక తీర్మానం చేయబడింది.

కట్టెల సమస్యను గురించి జిల్లా కలెక్టరుతో సంప్రదించుటకు జనాబ్ అలీబేగ్, డాక్టరు సీతారామశర్మ, రామినేని పిచ్చయ్య, గారలతో గూడిన ఒకకమిటీ నియమించబడింది.

కృష్ణాజిల్లా కో-ఆపరేటివ్ స్టోర్సు ప్రతినిధుల సమావేశం

ఈసమావేశం 16-4-44 వ తేదీని జిల్లా ఆహారకమిటీవారి యాజమాన్యాన బెజవాడలో జరిగింది. శ్రీ సి. రాజగోపాలాచారి బి. ఏ., బి. ఎల్., గారు అధ్యక్షత వహించారు.

కంట్రోలు పదార్థాలన్నీ కో-ఆపరేటివ్ స్టోర్సు ద్వారానే పంపిణీచేయుటకున్నూ, ఉత్పత్తి స్థానాలనుండి సరాసరి సరుకులను తెప్పించుటకు రవాణా సౌకర్యాలిప్పించుటకున్నూ; ప్రభుత్వం తోడ్పడవలసిందని కోరుతూ తీర్మానించబడింది. మిల్లు స్టాండర్డు బట్టను పల్లెటూళ్ళలో సహితం అమ్ముటకు నేయవలసిందనీ; గోధుమ వగైరా కంట్రోలు సరకుల విషయంలో ప్రజలకు పెర్మిట్లు యిచ్చే అధికారం స్టోర్సు ప్రెసిడెంట్లకు ఇవ్వవలసిందని కోరుతూ తీర్మానించడమయింది. సెంట్రల్‌స్టోర్సువారు సరకులను ఉత్పత్తి స్థానాలనుండి సరాసరి తెప్పించి, ప్రైమరీ స్టోర్సుకు యివ్వాలని నిశ్చయించబడింది. జిల్లాఅహారకౌన్సిల్‌లో కో-ఆపరేటివ్ స్టోర్సు తరఫున ఒకరిని మెంబరుగా తీసుకోవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ మరొక తీర్మానం ఆమోదించబడింది.

★

అరెస్టులు-శిక్షలు

అజంజాహిమిల్లు (వరంగల్) కార్మికుల సమ్మె సందర్భంలో పోలీసులచే అరెస్టు చేయబడిన కామ్రేడ్స్ ఎం. మల్లేశం, సయ్యద్ ఖుంద్‌మీర్‌లకు కోర్టులో చెరి 15 రోజులు కఠినశిక్ష విధించబడింది.

బెంగాల్‌నిధికి వసూళ్లు

	రూ.	అ.	పై.
12-4-44 ప్రజాశక్తిలో ప్రకటించన మొత్తం	6597	6	0
ప॥ గో॥ జిల్లా వేంద్రలో స్త్రీలు వసూలుచేసినది	18	4	0
,, పార్టీసభ్యులు రైలులో వసూలు చేసినది	35	3	3
బండి వెంకటకృష్ణయ్య	10	0	0
చెరుకూరి వెంకటరత్నం, భాస్కరావుగార్ల పెండ్లి సందర్భంలో వసూళ్లు	11	0	0
తెనాలి, మూల్పూరి నాగభూషణంగారు	5	0	0
రాజమండ్రిలో బహిరంగసభలో వసూలు	90	0	0
కొరివి వెంకటసుబ్బయ్యగారి పెండ్లిలో	10	0	0
పెదనలో ఒకవాగ్దానం వసూలు	6	0	0
,, పార్టీసెల్ విరాళం	8	0	0
గుంటూరు ప్లాంటర్సు కాఫీప్రోపగాండిస్టు	25	0	0
గుంటూరుతాలూకా మందపాడు	32	14	6
,, పాలపర్రు	1	1	9
నండూరి వెంకటసుబ్బారావుగారి వసూళ్లు	6	7	6
యం. సుబ్బారావు. (నారాయపాలెం) వసూళ్లు	18	0	0
గుత్తా రామయ్యగారి వివాహంలో (తెన్నేరు)	3	0	0
రామచంద్రపురంలో వాగ్దానం వసూలు	11	0	0
పాములపాడునుండి ముక్కామల నాగభూషణం గారిద్వారా	10	0	0
తోట్లవల్లూరు, ఆర్. కోటేశ్వరరావుగారి పెండ్లిలోవసూలు	16	0	0
వీరులపాడునుండి	5	0	0
జొన్నలగడ్డ రామలింగయ్యగారు రైలులో వసూలు చేసినది	20	12	0
పెంచికలదిన్నె	73	5	0
తేలప్రోలు	6	0	0
చిల్లరవసూళ్ళు	0	8	0
బంగారు వెండినగల అమ్మకం వల్ల	413	2	0
	7433	0	0

ఈ మొత్తంలో 12-4-44 తేదీ నాటికి పంపిన రు. 6597-6-0 గాక మిగిలిన రు. 835-10-0 కూడ ఈ తేదీని బెంగాల్ "పీపుల్సు రిలీఫ్ కమిటీ" కలకత్తాకు పంపబడినది.

గుంటూరుజిల్లాలో పృధ్వీసింగ్ సంచారం చేసినప్పుడు వసూలైన విరాళాలనుగూర్చి 5-4-44 తేదీ ప్రజాశక్తిలో రు. 1434-13-0 న్నూ 12-4-44 ప్రజాశక్తిలో వాగ్దానాల వసూళ్లు 175-0-0 లున్నూ వసూలైనట్లు ప్రకటించాము. మొత్తం ఈ రు. 1609-13-0 లకు వివరాలు ఈదిగువ యిస్తున్నాం.

	రూ.	అ.	పై.
తెనాలి	రు. 238	7	6
గుంటూరు	132	10	0
నర్సరావుపేట	997	13	9
రేపల్లె	240	13	9
	1609	13	0

రాయలసీమనిధికిగాను యస్. బాబాజాన్ సాహెబ్ అనే ఆయన రు. 5-0-0 వసూలు చేసి మా కార్యాలయానికి పంపారు.

బెజవాడ
22-4-44 } సంపాదకవర్గం

6 వ కృష్ణాజిల్లా మహిళా మహాసభ చౌటపల్లి

కృష్ణాజిల్లా మహిళాసంఘంయొక్క 6 వ వార్షికోత్సవం ఏప్రిల్ 28, 29 తేదీలలో గుడివాడ తాలూకా చౌటపల్లి గ్రామములో జరుగుతుంది. మహాసభ శ్రీ మానికొండ సూర్యావతిగారు ప్రారంభిస్తారు. డాక్టరు లక్ష్మి యం. బి. బి. యస్. గారు పతాకోత్సవం చేస్తారు. డాక్టరు అచ్చమాంబగారు మెల్లీషో లింగర్‌గారు, టి. సావిత్రిగారు, (గుంటూరు జిల్లా మహిళాసంఘసెక్రటరీ) మొదలైనవారు మహాసభలో వుపన్యసిస్తారు. యీసందర్భంలో శిశుప్రదర్శనము, అఖిలభారత మహిళా మహాసభనుగూర్చి, ఆరోగ్యాన్ని గురించి, సోవియటుస్త్రీలను గురించి, ఉపన్యాసాలుంటాయి. మధ్యాహ్నం పాటల పోటీలు, సాయంత్రం ఊరేగింపు బహిరంగసభ ఉంటాయి. రాత్రికి వీరేశలింగం బుర్రకథ చెప్పబడుతుంది.

పదిమంది ప్రాథమిక సభ్యులకొక ప్రతినిధి చొప్పున ప్రాథమికసంఘాలు ప్రతినిధులను ఎన్నుకొని పంపాలి. ప్రతినిధి రుసుము ప్రేక్షకులకు భోజనవసతులుండవు.

గమనిక: చౌటపల్లిగ్రామము గుడివాడ ముదినేపల్లి రైనులోవున్నది. గుడివాడ స్టేషనులోను, బస్‌స్టాండులోను ప్రతినిధుల సౌకర్యార్థం బండ్లుకూడ ఏర్పాటు చేయబడును.

ఇట్లు
వెల్లంకి అన్నపూర్ణాదేవి
కృష్ణాజిల్లా మహిళాసంఘ సెక్రటరీ

(7 వ పేజీ తరువాయి) ఎక్కువయింది. ముమ్ముందు ఇంకా జపానుకు సోవియటు సహాయం చేయవలసి వుంటుందేమో. అని "ప్రజామిత్ర" వ్రాసింది. ఇంతకన్నా గుడ్డితనం మరొకటిలేదు. మొట్టమొదటిది. ఒడంబడికలోని షరతులను జపానుకోరలేదు. సోవియటేజపానుపైనవిధించింది. ఇంతేగాక సోవియట్ తటస్థ విధానం అంటే, సంతృప్తి పరచి లొంగిపోయే విధానంకాదు. అందుచే తనకిష్టమున్నా లేకపోయినా, ఈ ఒడంబడికను జపాను ప్రస్తుత యుద్ధ పరిస్థితులలో అంగీకరించ వలసివచ్చింది. ఇతరచోట్ల నూనె దొరకడంవల్ల ఈ ఒడంబడికకు జపాను అంగీకరించిందని ఇదే పత్రిక వ్రాసింది. అయితే, ఈ నూనె దొరికింది ఈ నాడు కాదే! ఇంతకు ముందే సోవియట్‌తో ఈ ఒడంబడిక ఎందుకుచేసుకోలేదు? అసలు మిత్రరాజ్యాలతో బ్రహ్మాండమైనయుద్ధంచేయవలసినజపాను-యూరప్ యుద్ధం ముగిసాక మిత్రరాజ్య శక్తినంతా ఒంటరిగా ఎదుర్కోవలసిన జపాను- ఈ నూనెను, ఆహార పదార్థాలను సైతం వదులుకో జూస్తుందంటే హాస్యాస్పదం, జర్మనీ గెలిచే ఆశలు విఫలమయినవి గనుకనే సోవియటు చెప్పినట్లు జపాను ఒడంబడిక చేసుకొంది. నూనె, చేపల నష్టంతోపాటు జపాను ప్రతిష్ఠ ఎంత గంగపాలైందో నునంచూడాలి.

అయ్యో,జపాను రష్యాలు కొట్టుకొంటాయి అనుకొన్నాం; అలా జరగలేదే. ఇంకేముంది? మనదేశానికి ప్రమాదం హెచ్చింది. అన్న ధోరణిలో ఎక్స్‌ప్రెస్, ఆంధ్రపత్రికలు ఏడ్చాయి.

సోవియటు క్షేమం కోరిన వాడెవ్వడుగాని, మిత్రరాజ్యాల క్షేమంకోరే వాడెవ్వడుగాని, నాజీ రాక్షసులతో చావుబ్రతుకుల సమరం చేస్తున్న సోవియటు, జపానుతో మరో యుద్ధం తలపెట్టుకోమని చెప్పడు. అమెరికాలో హిట్లరు అనుకూలముతాయే సోవియటు జపాన్‌పై యుద్ధంచేయాలని నినాదం లేవదీసింది. అధ్యక్షుడు రూజువెల్టు సైతం "జపానుపై రష్యా యుద్ధం చేయాలని మనం కోరలేం" అని అంటుంటే, రష్యా-జపానులు కొట్టుకోవాలని ఈ దేశంలో కాంక్షించడం ఎంత అసమంజసమైన కోరికో వేరే చెప్పనక్కరలేదు.

పోతే ఈ ఒడంబడిక వల్ల భారతదేశానికి ఎక్కువ ప్రమాదం సంభవించిందా? 20 ఏండ్లకు పైగా జపాను సోవియటుపై బడాలని కాచుకుకూర్చుంది. పైబడ ప్రయత్నించినప్పుడల్లా చావుదప్పి కన్ను లొట్టబోయి బయటబడింది. సోవియటులో జర్మనీ పురోగమించుతున్న రోజులలో సైతం. రష్యాపై దూకడానికి సంసిద్ధపడని జపానుకు ఇప్పుడు రష్యాతో యుద్ధం చేసి జయించగల శక్తి వుందనుకోవడం పొరపాటు. అందుచే, జపాను - రష్యాలు పోట్లాడుకొంటాయి. ఆ విధంగా మనకు ప్రమాదం తప్పుతుందిఅనిఆంధ్రపత్రికపిరికితనంగాఅలోచింపవలసిన అవసరమేలేదు. అందుచే ఒడంబడికవల్ల కొత్తగా మనకువచ్చినప్రమాదమూ లేదు. పైగా, కాకసస్‌లో నాజీల నరికట్టి, ఇండియాను జపాను-జర్మనీలు పంచుకోవాలనే ఆశలను అరికట్టి, రష్యా మనకుమహోపకారం చేసింది. నాజీ జర్మనీని చిదకకొట్టడంద్వారా, మిత్రరాజ్యాలు జపానుపై దాడి వచ్చే సుముహూర్తాన్ని త్వరితపరుస్తోంది, నేటి ఒడంబడికద్వారా పసిఫిక్‌లో జపాను బలాన్ని క్షీణింపజేసింది. ఆ విధంగా ఒక్క పశ్చిమయూరప్‌లోనే ఫాసిజాన్ని నాశనం చేయడంగాక, ప్రాచ్యభాగంలోకూడ ఫాసిజాన్ని రూపుమాపటంలో సోవియటు ఎక్కువ సహాయం గావించుతోంది.

సవరణ

గత సంచికలో 'పృధ్వీసింగ్ సంచారం' వార్తల్లో రామచంద్రపురంలో 'రు. 15-0-0 ప్రోగయింద'ని పడింది. ఇది తప్పు. వెంటనే వసూలయింది రు. 134-0-0 వాగ్దానాలు వసూలయింది. రు. 11-0-0.

ఉంగరమిచ్చిన బడేసాహెబుగారు వర్తకులు కాదు. వారు డాక్టరుగారు.

అఖిలభారత మహిళా మహాసభ

అన్నిపక్షాల స్త్రీలు ఐక్యమయారు

ఈ నెల 7, 8, 9 తేదీలలో బొంబాయిలో జరిగిన అఖిలభారత మహిళా మహాసభకు అన్ని రాష్ట్రాలనుండి 200 మంది ప్రతినిధులు హాజరయారు. లిబరల్‌పార్టీ (మితవాదపార్టీ) మొదలు కమ్యూనిస్టుపార్టీవరకు, అన్నిరాజకీయ దృక్పథాలకుచెందిన స్త్రీలూ ప్రతినిధులుగా వచ్చారు.

శ్రీమతి సరోజనీనాయుడు, విజయలక్ష్మిపండిట్, ఎప్పటికప్పుడు మహాసభ కార్యనిర్వహణలో మార్గదర్శకులై, ప్రతినిధుల్ని ఉత్తేజపరిచారు. బెంగాల్‌లో చాలా కాలంనుంచి సంఘసేవలో నిమగ్నురాలైయున్న ఎస్. సి. ముఖర్జీసతి, బెంగాల్‌రాష్ట్ర కాంగ్రెసునాయకుడైన శ్రీ బిధన్‌చంద్రరాయి మరదలు రాయిసతి, ప్రతినిధులుగా వచ్చారు. జపాన్‌దాడిని యెదుర్కొంటూన్న అస్సాంనుండి యిద్దరు పిల్లలు 50 సంవత్సరాల తల్లితో, 6 రోజులు రైల్లో ప్రయాణంచేసి మహాసభకు ప్రేక్షకులుగావచ్చారు. హైదరాబాద్ సంస్థానంనుండి ఒక ముస్లిం స్త్రీలదళం వచ్చింది. మహారాష్ట్రంనుండికూడా అనేకమంది స్త్రీలు ప్రతినిధులుగాను, ప్రేక్షకులుగాను వచ్చారు.

బెంగాల్‌లో కరువువల్ల స్త్రీలు, పిల్లలు పడుతూన్న బాధలు ప్రతినిధుల హృదయాలలో హత్తుకుపోయాయి. తల్లులు పిల్లల్ని అమ్ముకోవడం, సోదరీమణుల శీలాన్ని విడిచిపెట్టడం - మొదలైన దారుణాలు కాంగ్రెసు స్త్రీలను, ముస్లింస్త్రీలను, లిబరల్‌స్త్రీలను సమానంగా కలచివేశాయి. తమతమ రాష్ట్రాలలో ఆహారసమస్య విషమించడంవల్ల, మధ్యతరగతి స్త్రీలు రాజకీయాలలో ప్రవేశించుతున్నారు.

ఇందువల్లనే ఈయేడు అఖిల భారత మహిళాసంఘం యొక్క స్వభావం పూర్తిగా మారిపోయింది. అన్నిపక్షాలకు చెందిన స్త్రీలు దేశభక్తితో ముందుకొచ్చి, అందరినీ సమానంగా యెదుర్కొనే సమస్యలను పరిష్కరించుకొనేటందుకు అఖిలభారత మహిళాసంఘం ఒక జాతీయ సంస్థగా వృద్ధిచెందింది. భారతమహిళాలోకం అంతా కోరే కోర్కెలను, హక్కులను ప్రతిబింబించే సంస్థగా మార్పుచెందింది. ప్రతిరాష్ట్రంనుండి వచ్చిన స్త్రీలు యితర రాష్ట్రాలలో వున్న తమతోడి స్త్రీజాతిని ఉద్ధరించాలని ఉవ్విళ్ళూరారు.

సరోజినీదేవికి స్వాగతం

అఖిలభారత మహిళా సంఘం తరఫున శ్రీమతి సరోజినీదేవికి సన్మానపత్రం ఇవ్వబడింది. అప్పుడు షుమారు 100 మహిళా సంస్థలు ఆమెను పుష్పమాలలతో నింపివేశాయి. హిందూ స్త్రీలు, ముస్లింస్త్రీలు కూడా వారిలో వున్నారు. హిందూ-ముస్లిం ఐక్యత కొరకు శ్రీమతి సరోజనీ గావించిన కృషిని అందరూ అభినందించారు. మహిళా ఉద్యమంలో పట్టుదలగా పనిచేస్తూన్న కుల్‌సుం సయానిసతి ఒక సన్మానసభను యేర్పాటుచేసింది. ఆమె ముస్లిం స్త్రీ. దాదాపు 500 మంది మధ్యతరగతి ముస్లిం స్త్రీలు ఈసభకు హాజరయారు. ఇట్టిసంఘటన బొంబాయి చరిత్రలోగాని, అఖిల భారత మహిళాఉద్యమచరిత్రలోగాని, ఎన్నడూ జరగలేదు. ఇలాగే పరేల్‌లోషుమారు 2000 మంది కార్మిక స్త్రీలు మహిళా ఉద్యమ నాయకురాండ్రను సన్మానించారు.

కాంగ్రెసుసోషలిస్టుల విచ్ఛిన్నప్రయత్నాలు

ఈవిధంగా మహాసభకు వచ్చిన వివిధపక్షాల ప్రతినిధులు కలిసి పనిచేయడానికొక కార్యక్రమంకొరకు యెదురు చూస్తుంటే, కొంతమంది కాంగ్రెసు సోషలిస్టు స్త్రీలు మహాసభను చీల్చడానికి ప్రయత్నించారు. ఆహార సమస్యను గురించిగాని, బెంగాలుకరువు బాధితుల సహాయ సమస్యను గురించిగాని, జాతీయ ప్రభుత్వ స్థాపనను గురించిగాని, మహాసభ యెట్టి నిర్ణయాలను చేయకుండా చూడ్డమే వారి ఉద్దేశం. హిందూ - ముస్లిం ఐక్యతనుగురించిగాని, జాతీయ నాయకుల విడుదలనుగురించిగాని, ఆలోచించకుండా చేయడమే వారి యెత్తు.

కాని, పాపం, దేశపరిస్థితులు స్త్రీలలో యెలాంటి మార్పు తీసుకొచ్చాయో వీరు గమనించనందున, వీరి ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. జపాన్ సేనలొకవైపు దేశంలో ప్రవేశించాయి. బెంగాల్‌లో అన్ని రాజకీయపార్టీలు, వైద్యసహాయక సంస్థల ఐక్యకమిటీకింద కలిసి పనిచేస్తున్నాయి. ఇతర రాష్ట్రాలవారు తమకు సహాయం చేయవలసిందని విజ్ఞప్తి చేస్తున్నాయి. యు. పి. కాంగ్రెసు నాయకుల సమావేశంలో ముస్లిం జాతుల స్వయం నిర్ణయ హక్కు గుర్తించబడింది. ఆహార సమస్యమీద, బెంగాల్ కరువు బాధితుల సహాయం కొరకు, అన్నిపార్టీలు కలిసిపనిచేయాలని శ్రీమతి సరోజినీదేవి పదేపదే హెచ్చరికలు చేస్తోంది. ఇటీవల కేంద్రశాసన సభలో కాంగ్రెసు - ముస్లిం లీగ్‌ల మధ్య సమకూరిన ఐక్యతను దేశం అంతా శ్లాఘించుతోంది.

ఈ పరిస్థితుల్లో కాంగ్రెసుసోషలిస్టుల ప్రయత్నాలేవీ సఫలంకాలేదు. వెంటనే మరొక యెత్తువేశారు. కమ్యూనిస్టు స్త్రీలపై యితర స్త్రీలలో అపోహలు కలిగేటట్లు దుష్ప్రచారం ప్రారంభించారు. అఖిలభారత మహిళాసంఘాన్ని స్వాధీనంచేసుకోడానికే కమ్యూనిస్టులొచ్చారని పుకారులు లేవదీశారు. బొంబాయి మేయర్ ఎం. ఆర్. మసానీ యిట్టి అర్థమేవచ్చేటట్లు ఒక ఉపన్యాసంలో చెప్పాడు. వారి పత్రిక "హింద్ - ప్రజ"లో కమ్యూనిస్టు స్త్రీలపై అనేక నిందలు మోపుతూ వ్యాసాలు, వార్తలు ప్రకటించబడ్డాయి. కమ్యూనిస్టు స్త్రీలనుండి కాంగ్రెసు స్త్రీలను వేరుచేయడమే వీరి ఉద్దేశం. కాని, ప్రతినిధుల సమావేశాలలో కమ్యూనిస్టు స్త్రీల నిజమైన దృక్పథం యేదో అందరికీ తెలిసింది. మహిళాసంఘాన్ని ఐక్యసంస్థగా చేయడమే వారి ఉద్దేశం తప్ప, మరొకటికాదని స్పష్టమయింది. ఫలితం, స్టాండింగ్ కమిటీ సమావేశాలలోనే విచ్ఛిన్నకుల నోళ్లు రాజకీయంగా మూతపడ్డాయి. కొత్తస్టాండింగ్ కమిటీలో మితవాద స్త్రీలు, జాతీయవాదులు, కాంగ్రెసువాదులు, కమ్యూనిస్టులు - అంతా సభ్యులు.

ఆహారసమస్యను గురించి, బెంగాల్ కరువుబాధితులకు సహాయాన్ని గురించి, రాజకీయ సమస్యను గురించి, స్టాండింగ్ కమిటీ ఆమోదించిన తీర్మానాలు, కాంగ్రెసుసోషలిస్టుల పంథాను అరికట్టాయి. ఈ తీర్మానాలలో దేశభక్తియుతమైన ఒక ఐక్య కార్యక్రమం, దేశానికంతకూ వర్తించేలాగు, ఈయబడింది. స్టాండింగ్‌కమిటీలో ఉన్న కమ్యూనిస్టుస్త్రీలు అఖిలభారత మహిళాసంఘంయొక్క ఐక్యతను కాపాడటానికి చూపిన శ్రద్ధ, ఆతృత మిగతా స్త్రీలందరినీ - కాంగ్రెసు, లిబరల్, నేషనలిస్టు పక్షాలకుచెందినవారిని - ఆకర్షించింది.

మ హా స భ

మహాసభకు షుమారు 3000మంది స్త్రీలు హాజరయారు. అన్ని తరగతులకు చెందినవారు ఇందులో వున్నారు. అఖిలభారత మహిళాసంఘ చరిత్రలో యిది అపూర్వమైన సంఘటన బహిరంగసభలో శ్రీ భూలాభాయిదేశాయి ఉపన్యసిస్తూ, సోవియట్‌యూనియన్‌లో స్త్రీలకీయబడిన సరిసమాన హోదాను ప్రశంసించారు. యుద్ధంలోను, యుద్ధానంతరం కూడా సోవియటుదే ప్రధానపాత్రగా ఉంటుందని స్పష్టీకరించారు. విజయలక్ష్మి పండిట్ ఉపన్యాసంలో బెంగాలు కరువు బాధితుల సహాయార్థం అఖిల భారత మహిళాసంఘ శాఖలన్నీ పట్టుదలగా పనిచేయాలని ఉద్బోధించారు.

తీర్మానాలు

బెంగాల్‌లో, దేశభక్తియుతమైన ప్రతి రిలీఫ్ సంస్థ "వైద్యసహాయ సంస్థల ఐక్యకమిటీ"గా యేర్పడి, కరువు బాధితులకు సహాయంచేస్తూన్నందుకు మహాసభ సంతసం వెలిబుచ్చింది. ఆసంస్థకు అఖిలభారత మహిళాసంఘం పూర్తిగా తోడ్పడుట కంగీకరించింది. బెంగాల్ కరువువల్ల భిక్షం ఎత్తుకుంటూ, పడుపువృత్తిచేస్తూ, కాలం గడిపే స్త్రీలను కాపాడటానికి అన్నిశాఖలు పనిచేయాలని తీర్మానించింది. శ్రీమతి సరోజనీనాయుడు మీద ప్రభుత్వం విధించిన ఆంక్షను తొలగించవలసిందని కోరుతూ మరొక తీర్మానం. స్త్రీల విద్య, హిందూలా సవరణబిల్లు, స్త్రీ కార్మికులకు రక్షణ సదుపాయాలు, స్త్రీలచేత గనులలో పని చేయించడం - మొదలైన సమస్యలపై కూడా వేర్వేరు తీర్మానాలామోదించబడ్డాయి.

రాజకీయ తీర్మానంలో, ప్రస్తుత విషమ పరిస్థితులకు కారణం రాజకీయ ప్రతిష్టంభన అనీ; కాబట్టి ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వంకొరకు ప్రజలాందోళన చేయాలనీ, తీర్మానించారు. అహారసమస్యకు సంబంధించిన తీర్మానంలో, ప్రభుత్వంయొక్క అవకతవక విధానమే కారణమనీ; అయినప్పటికీ ప్రజాప్రతినిధులుగల ఆహారకమిటీలతో సహకారంచేస్తూ కొంతవరకైనా కరువుసమస్యను పరిష్కరించవచ్చుననీ, తెలియజేయబడింది.

ప్రజాసంస్థగా వృద్ధిచెయ్యాలి

మహాసభకువచ్చిన మితవాదపార్టీ ప్రతినిధులు, జాతీయవాదులు, కాంగ్రెసు స్త్రీలు, కమ్యూనిస్టులు - విచ్ఛిన్న ప్రయత్నాలముందు విభ్రమంతోకలిసి నిలబడ్డారంటే, కారణంఏమిటి? నేటిపరిస్థితులలో మనం యేమీ చేయలేమను పాడుపైఖరిని విడిచిపెట్టి, దేశభక్తియుతమైన ఒక ఐక్యకార్యక్రమాన్ని యివ్వగలిగారంటే, కారణంయేమిటి? బెంగాల్‌తప్ప మరొకటికాదు. స్టాండింగ్ కమిటీ సభ్యులయెదుట పి. ఇ. ఎన్. క్లబ్బువారు (కవులు, సంపాదకులు, నవలాకారులు సభ్యులుగావున్న ఒక సంఘం) ప్రదర్శించిన నృత్యం, సంగీతం ప్రేక్షకుల్ని చక్కగాఆకర్షించింది. బెంగాలు వైజ్ఞానికదళం ప్రదర్శించిన కరువుదృశ్యం అందరినీ విచార సముద్రంలో ముంచింది. ఈప్రదర్శనం శ్రీమతి సరోజినీనాయుడు, విజయలక్ష్మి పండిట్‌లను, కన్నీళ్ల పర్యంతం తీసుకువచ్చింది. ఆ వైజ్ఞానికదళాన్ని విజయలక్ష్మిపండిట్ తన రాష్ట్రానికి ఆహ్వానించింది. కరువు నిధికి యెంత వసూలు చేయవచ్చునో అంతా వసూలుచేయడానికి వాగ్దానం చేసింది. నేపాల్ మహారాణి అప్పటికప్పుడు రు. 1001 బెంగాల్ నిధికి యిచ్చింది.

ఈసమావేశంవల్ల కలిగిన ఫలితాలేమిటి? అన్ని పక్షాలకు చెందిన దేశభక్తురాండ్ర మధ్య ముఖ్యంగా కమ్యూనిస్టు — కాంగ్రెసు స్త్రీలమధ్య పూర్వంకంటె అనేకరెట్లు ఐక్యత యెక్కువై కమ్యూనిస్టు స్త్రీలు కాంగ్రెసు స్త్రీలపట్ల చెల్లెళ్ళవలె మెలగారు. మరొక ఫలితం ఏమంటే మహాసభ దేశానికొక ఐక్య కార్యక్రమాన్ని యిచ్చింది. దాన్ని ఆచరణలో పెట్టడానికి అన్నిపార్టీలకు చెందిన దేశభక్తురాండ్రకు అవకాశంవుంది.

అఖిల భారత మహిళాసంఘ శాఖలన్నీ ఈ కార్యక్రమాన్ని యెంత యెక్కువగా ఆచరణలోపెడితే, యెంత చక్కగా యిప్పటి ఐక్యతను వృద్ధిచేస్తే, యెంత చొరవతో యితర మహిళాసంఘాలచేత పని చేయించగలిగితే - అంత చక్కగా అఖిల భారత మహిళా సంఘం ఒక పెద్ద ప్రజాసంస్థగా వృద్ధిచెందుతుంది; భారత దేశ స్త్రీలందరికీ యిదే ప్రతినిధిసంస్థగా వర్ధిల్లుతుంది.

(8 వ పేజీ తరువాయి)

శత్రువు ఇండియా సరిహద్దులలో ప్రవేశించినందున ఇండియా ప్రభుత్వం ఉత్తరాలమీద, టెలిగ్రాంలమీద సెన్సార్‌షిప్ ప్రయోగిస్తూ ఉత్తరువులు జారీచేసింది.

• • •

జొన్న,రాగి,కొఱ్ఱ,సజ్జ మొదలైన మెట్టపైరులు పండించే రైతులు యకరానికి ఒక మణుగువంతున (10 యకరాలకంటె ఎక్కువ సాగుచేసేవారే)జిల్లాకలెక్టరు నిర్ణయించబోయే ఖరీదుకు ప్రభుత్వానికిగాని, ప్రభుత్వ లైసెన్సుపొందిన వ్యక్తులకుగాని, మాత్రమే అమ్మాలని ఉత్తరువు జారీ చేయబడింది.

• • •

ఆగస్టు ఘటనల సందర్భంలో ఉరిశిక్ష విధించబడిన 8 గురు చీమూర్ ముద్దాయిలకు నాగపూరు హైకోర్టుజడ్జీ శిక్షను ఖాయంచేశాడు. మొదటి చీమూరుకేసులోని 7 గురు ముద్దాయిలపైకూడా ఉరిశిక్ష ఖాయంచేయబడింది.

★ యుద్ధ సమీక్ష

ఫిన్నిష్ ప్రభుత్వం శాంతిని కాలదన్నింది

క్రిమియా ద్వీపకల్పంలో శత్రుశేషం లేకుండా చేయ సంకల్పించిన రెడ్ ఆర్మీ బాలక్‌లవా ను పట్టుకొంది. చరిత్ర ప్రసిద్ధమైన ఈ నగరం సెబాస్తపోల్‌కు ఆగ్నేయంగా 8 మైళ్ళలోవుంది. సెబాస్తపోల్ గుమ్మంలో చొరబడి రెడ్‌ఆర్మీ శత్రువుతో భీషణసంగ్రామంచేస్తోంది. క్రిమియానుండి పారిపోదలచిన నాజీ రాక్షసులను సోవియటు విమానాలు, నౌకలు, హతమారుస్తున్నాయి.

సెబాస్తపోల్‌లో తిరిగి ఎర్రజెండా ఎగిరిననాడు, బాల్కన్ దేశాలవిముక్తి మరింత దగ్గరపడుతుంది. క్రిమియాలో నేడు పోరాడుచున్న టోల్బుఖిన్, యెర్మెంకో సైన్యాలు, మార్షల్ జుకావ్, కోనెవ్‌లకు అండగా వస్తాయి. అప్పుడు రుమేనియాలో జొరబడ్డ ఎర్రసేనలు, జకొస్లోవేకియాలో అడుగుపెట్టిన సేనలు మరింత విజృంభించి, రుమేనియా, బల్గేరియా, హంగరీ, జకొస్లోవేకియా, పోలెండులను నాజీల చెరనుండి తప్పించ పూనుకొంటాయి.

వేసవి ప్రారంభించింది. బురదబురదగా ఉండే దక్షిణయుద్ధరంగంలో నేల ఎండుతోంది. బరువాటి యుద్ధసామగ్రిని తీసుకుపోవడానికి ఇదివరలా ఆటంకం ఉండదు. ఇదంతా గుర్తించే, హిట్లరు తొందరపడుతున్నాడు. రెడ్‌ఆర్మీ పురోగమనాన్ని ఆలస్యంచేయాలని ప్రయత్నించుతున్నాడు. కాని ఎక్కడా ఫలించడంలేదు.

బెస్సరేబియా రాజధాని కిషినెవ్‌వైపుకు రెడ్‌ఆర్మీ పురోగమించుతునేవుంది. ల్వోవ్‌కు సింహద్వారమైన స్టానిస్లావావ్‌వద్ద భయంకర యుద్ధాలు జరుగుతున్నాయి. అటు ల్వావ్ వైపుకు, ఇటు జకొస్లొవాకియాలోకి మార్షల్ జుకావ్ సైన్యాలు రాకండాచేయాలని నాజీలు విశ్వప్రయత్నం చేస్తున్నారు. అందుచే తనే వారంరోజులక్రితం నాజీసేనలు స్టానిస్లావావ్ ప్రదేశంలో తీవ్రంగా ఎదురుదాడులు సాగించాయి. కొలదిప్రదేశంలో ఎక్కువ టాంకులను సేకరించి, ముందుకు చొచ్చుకుపోజూచుతున్న జర్మన్లను మార్షల్ జుకావ్ తిప్పికొడుతున్నాడు. ఉత్తరాన ఇస్తోనియాలో నార్వావద్ద నాజీలు హఠాత్తుగా గావించిన ఎదురుదాడులనుకూడ సోవియటుసైన్యాలు త్రిప్పికొట్టివేసాయి.

"బెర్లిన్ చేరతాం"

ఒక్క బాల్కను రాజ్యాలనేగాక యూరప్‌ను యావత్తూ హిట్లరు చెరనుండి తప్పించడానికి బ్రహ్మాండ యుద్ధాలు మున్ముందు చెయాలి. అందుకే వేసవిలో రెడ్ ఆర్మీ సంసిద్ధపడుతోంది. ఈసందర్భంలో ఒక సుప్రసిద్ధ సోవియటు రచయిత ఇలా అన్నాడు. "మేం జర్మనీ నడిబొడ్డుకు-బెర్లిన్‌కు చేరతాం. మాకు ఇతరుల భూమి అక్కరలేదు. అలాగే ఉత్తఉత్తపేరు ప్రతిష్టలూ అక్కర్లేదు. 1914-41 యుద్ధాలు మాకు గుణపాఠం చెప్పాయి. అదిచాలు. మళ్లా 1965 లో రష్యాపై జర్మనీ దండయాత్ర అక్కర్లేదు. మాదేశంపైబడ్డ రాక్షసికోరలనుఊడబెరకందే మేం నిద్రపోము."

ఈప్రకటన ఏం తెలియజేస్తోంది? నాజీలను యుద్ధంలో ఓడించడమేగాదు. తిరిగి ఫాసిజం తలయెత్తకుండా దురాక్రమణలు అసంభవమయ్యేటట్లు చేయడమే సోవియటు ఆశయం.

బడోలియో కొత్త ప్రభుత్వం

ఇటలీలో బ్రిటన్, అమెరికా ప్రభుత్వాల మిలిటరీ పరిపాలన ఫలితంగా ఇటాలియన్ ప్రజల ఉత్సాహం కుంటువడింది. జర్మన్లను ఇటలీనుండి పూర్తిగా బయటికి పారద్రోలాలంటే, అన్నిపక్షాల ఐక్యత అవసరం. ప్రధానసమస్యను వదలి, రాజరికం ఉండాలా పోవాలా? అని కొట్టుకులాడుతున్న ఇటాలియన్ రాజకీయ పక్షాలకు దారిచూపింది సోవియటు ప్రభుత్వం. బడోలియో ప్రభుత్వముతో సంబంధంపెట్టుకొంది. ఈనాడు బడోలియో తన పాతమంత్రివర్గాన్ని రద్దుచేసి, వివిధ ప్రజాస్వామ్య పక్షాలతోగూడిన మంత్రివర్గాన్ని యేర్పరిచాడంటే, అది సోవియటు చూపిన చొరవ ఫలితమే. నేడు బడోలియో మంత్రివర్గంలో కమ్యూనిస్టుకూడ వున్నాడు.

ప్రజాస్వామ్య శక్తులు పెంపొందినకొలదీ, ఫ్రెంచి స్వాతంత్ర కమిటీలో ఫాసిస్టులు - ఫాసిస్టు అనుకూలురు వైదొలగినట్లుగానే, ఇటలీలో కూడ జరుగుతోంది.

రెండవ రంగం

యూరప్‌పై రేపోమాపో దండయాత్రకు సన్నాహాలు జరుగుచున్నాయని జర్మను రేడియో వార్త. అందలి నిజానిజాలు అలావుంచండి. రెండవరంగం తెరచిననాడు జర్మనీ పని ఏమవుతుందో డాక్టరు బెనిస్ తెలియజేస్తున్నాడు. "యూరప్‌పై మిత్రరాజ్యాలు పెద్ద దెబ్బకొట్టే పక్షంలో, తూర్పునుండి సోవియటు కూడ పెద్ద దెబ్బ కొడుతుంది. అందుకు సోవియటు సిద్ధంగావుంది. రెండు ప్రక్కలా జర్మనీపై దండయాత్రలు సాగిననాడు, కొన్ని నెలలలోనే జర్మనీ కూలిపోకతప్పదు."

జర్మనీ చెప్పినట్లు ఇప్పుడే గాకపోయినా, త్వరలోనే రెండవరంగం తప్పదు. ఇటలీయొక్క నేటి యుద్ధరంగంలోని నిస్తబ్ధతను పోగొట్టి, యూరప్‌పై దండయాత్రను త్వరితపరచడానికి, నేటి ఇటలీ ప్రజాపక్ష మంత్రివర్గం పూనుకొంటుందని విశ్వసిస్తున్నాం.

ఫిన్లండు సంగతి

ఫిన్లండు మొట్టమొదట శాంతిసంప్రదింపులకు తయారైనప్పుడు, సోవియటు ప్రభుత్వం ఇలాచెప్పింది. "ప్రస్తుత ప్రభుత్వంలో మాకు ప్రత్యేక నమ్మకం ఏమీలేదు. అయినా శాంతిక్షేమాలనుకోరి సోవియటు ఈ సంప్రదింపులను విచారించడానికి సిద్ధమయింది." మార్చి 19 వ తేదీన ఫిన్లండు సోవియటు షరతులను నిరాకరించింది. కారణం? సోవియటు షరతులుచూస్తే అందులోఅసాధ్యమైనవిగాని, అసమంజసమైనవిగాని కోర్కెలేమీలేవు. అయితే ఫిన్లండు ఎందువల్ల నిరాకరించింది? ఫిన్లండు ఈనాడు జర్మనీకి కీలుబొమ్మ. అది ఎలా చెబితే అలా నడుచుకోవాలి. అందుచే విషిస్కీ చెప్పినట్లు, ఫిన్లండునుండి జర్మన్లను తరిమి ఫిన్లండుకు స్వాతంత్ర్యం పునరుద్ధరించడంతప్ప మరొక గత్యంతరంలేదు. మానర్‌హీమ్, టానర్‌లాంటి విద్రోహులకు ఫిన్నిష్ ప్రజలు బుద్ధిచెప్పడంతప్ప మరొక గత్యంతరంలేదు. 24—4—44

— తుమ్మల వెంకటరామయ్య

(1 పేజీ తరువాయి) సంభవిస్తుంది. దోపిడీలు, అరాజకం అంటురోగాలలో అందరూ నాశనమవడం జరుగుతుంది. పైగా ధాన్యం ధరలు పెరుగుతూవుంటే, వ్యవసాయ పనిముట్లు బట్టలు మొదలైన యితరజీవితావసర వస్తువులుకూడ పెరుగుతూవుంటాయి. దానివల్ల ధాన్యానికి ధరలుపెరిగినా రైతులకు లాభమేముంది? రైతులు జీవితావసరాలలో ముఖ్యమైన ఆహారవస్తువుల ధరలను కంట్రోలు చేయమని ఆందోళనచేయడంద్వారా, మిగతా జీవితావసరవస్తువుల కంట్రోలు ధరలుగూడ తమకు అందుబాటులో ఉండేటట్లు ఆందోళన చేయడానికి మిగతా ప్రజాసామాన్యంయొక్క సహాయాన్నిగూడ పొందగలుగుతారు. అన్ని వస్తువులకు ప్రజలకందుబాటులో వుండే ధరలను కంట్రోలుచేసి, వాటిని అవసరాన్నిబట్టి అందరికీ పంపిణీచేస్తేనేగాని ప్రస్తుతం దేశానికి రానున్న విపత్తునుండి రక్షించుకోలేం.

వర్తకులకు, పట్టణ ప్రజలకు

వర్తకులారా: తాత్కాలిక లాభాలకాశించి, దేశాన్ని స్మశానవాటిక చేయబోకండి. దేశం స్మశానం అయిన తర్వాత ఏమి పంటలు పండుతాయి? మీరు ఏమి వ్యాపారంచేస్తారు? న్యాయమైనలాభాలనుఎవ్వరుకాదనరు. వాటితో తృప్తిపడి, మీదేశభక్తిని రుజువు చేయాలి. పట్టణప్రజలారా: మన ఆంధ్ర దేశంలో రాయలసీమ, విశాఖపట్నం, తెలింగానా(నైజాం)లలో ఈ సంవత్సరం పంటలు పోయినాయి. ఆ ప్రాంతాలలో నివశించే మన సోదర ఆంధ్రులకు ఆహారపదార్థాలు సప్లయిచేయాలిసిన బాధ్యత మనమీద ఉంది. అందుకు ఆహారపదార్థాలను నిర్ణీత పద్ధతి ప్రకారం పంచాలి. అందుకు రేషనింగును పెట్టాలి. ముందుగా పట్టణాలలో రేషనింగును పెట్టడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఆరేషనింగు విధానాన్ని జయప్రదంగా కొనసాగించాలి. అందులోని లోపాలను సరిదిద్దడానికి ప్రయత్నించాలిగాని దాన్ని మొత్తంగా వ్యతిరేకించరాదు. రేషనింగువల్ల కొందరికి చిన్న ఇబ్బందులు గల్గినా, మొత్తం మీద ప్రజలందరికీ న్యాయమైన ధరలకు న్యాయమైన పద్ధతిమీద తిండి దొరుకుతుంది. ఆహారకమిటీలను పెట్టి, రేషనింగు జయప్రదంగా జరిగేలా చెయ్యాలి. రేషనింగు పెట్టని పట్టణాలలో దాని కోసం ఆందోళన చెయ్యాలి.

కార్మికులకు

కార్మికులారా: బట్టలు, మందులు మొదలైన జీవితావసర వస్తువుల నుత్పత్తి చేసేది మీరు. 1943 లో ఉత్పత్తి కుంటుబడకుండా చేస్తూ, దేశాన్ని జపానుకు బలిగాకుండా కాపాడారు. ఇంతవరకు మిల్లు యజమానుల నిర్బంధానికి రెచ్చిపోకుండా కాపాడుతున్నారు. అదే చాలదు. దేశరక్షణకోసం, అధికోత్పత్తి కార్యక్రమంతో కార్మికులంతా ఐక్యంగావాలి. మీకు ఇతర ప్రజల సహాయముంటుంది. మీరు ఓర్పుతో మీ విద్యుక్తధర్మాన్ని నెరవేర్చితే, మిల్లు యజమానుల ఆటంకాలు ఏమీచేయలేవు. ఇప్పుడు బొగ్గు, నూనె అరుదుగా ఉన్న ఈ రోజుల్లో, వాటిని జాగ్రత్తగా వాడండి. యంత్రాలను, పనిముట్లను జాగ్రత్తగా ఉంచండి. ఆంధ్ర మున్సిపల్ కార్మికులమీద ప్రత్యేక బాధ్యతఉంది. సరియైన తిండిలేక బలహీనపడిఉన్న ప్రజలపై అంటు రోగాలు తేలికగా దాడిచేస్తాయి. ఈ కరువు రోజుల్లో ఆంధ్ర పట్టణాలలో ఈ అంటు రోగాలు విపరీతంగా చెలరేగుతున్నాయి. వీటిని ప్రబలకుండా చేయడానికి, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచే బాధ్యత మీమీద ఉంది. మీపని కష్టమైనది. అందువల్ల ప్రజలు మిమ్మలను తేలికగా అభిమానించుతారు. మీ ధర్మం మీరు నెరవేర్చితే మీ కష్టాలీడేర్చడానికి ప్రజలు వెంటనే పూనుకుంటారు.

యువకులు, బాలురు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, పట్టణాలలోనూ, గ్రామాలలోను వైద్యదళాలను ఏర్పరచాలి. వాటిని పరిశుభ్రంగా ఉంచేలా చేయండి. అంటు జాడ్యాలను రూపుమాపండి.

మహిళలకు

మహిళలారా: మీరు భారతీయులలో సగభాగంగా ఉన్నారు. కాని మీరు బలహీనులుగా ఉండుటచే, దేశానికివచ్చే ఉపద్రవం, ముందు మీ మీదనే విరుచుకుపడుతుంది. బెంగాలులో కరవురావడం వల్ల ఎన్ని కుటుంబాలు విచ్ఛిన్నమయినాయి! భర్త చాటునో, తండ్రి చాటునో బ్రతికిన మధ్యతరగతి స్త్రీలునైతం, పొట్టకోసం ఎంతమంది పశువృత్తిని స్వీకరించాలిసి వచ్చింది! ఎంతమంది రోగాలతో కుళ్లి కాకులకు, గద్దలకు ఎర అయ్యారు! తమ ముద్దుబిడ్డలు పాలు లేక రోదనంచేస్తూ చనిపోతుంటే మీరు చూడాలిసివచ్చింది. వ్యవసాయకూలీ రైతుస్త్రీలు తమ భర్తలు అధిక పంటలు పండించడానికి తోడ్పడాలి. రైతు స్త్రీలు తమభర్తలు తిండిదొంగలకు ధాన్యం అమ్మకుండా చెయ్యాలి. కార్మిక స్త్రీలు తమ భర్తలను అధికోత్పత్తికి ప్రోత్సహించాలి. మహిళాసంఘాలను విరివిగా స్థాపించాలి. స్త్రీలు ఆహారపదార్థాల్ని పొదుపుగా వాడాలి. పాడిపశువులను శ్రద్ధగామేపి ఎక్కువపాలను, వెన్నను ఉత్పత్తిచెయ్యాలి. కోళ్ళను, బాతులను అధికంగాపెంచి, గుడ్లపరిశ్రమను అభివృద్ధి చేయాలి. పెరళ్ళలో కూరగాయలను అదనంగా పండించాలి.

ప్రజాపక్షంలో ఇరుకుకొని వున్న బ్రిటిషు, అమెరికను సామ్రాజ్యవాదుల బలం క్షీణించుతోంది. యుగోస్లావియా, ఇటలీ, గ్రీసు, ఫ్రాన్సు, లిబియా, మొదలైన అన్నిదేశాలలో వీరిఎత్తులు విఫలమయ్యాయి. సోవియటు యూనియను సహాయంతో ఈ సామ్రాజ్యవాదులమీద ప్రజాశక్తులే విజయం సాధిస్తున్నాయి.

రెడ్‌ఆర్మీ విజయాలవల్ల యూరపు ఖండానికే కాదు, ఆశియాఖండానికి గూడ విముక్తి దగ్గర పడుతోంది. హిట్లరు ఓటమి యెంత త్వరగా పూర్తిఅవుతుందో, అంత త్వరగా జపానుసామ్రాజ్యవాదులమీద ప్రపంచ ప్రజాశక్తి ఉపయోగింపబడుతుంది. అంతత్వరగా భారతదేశ సమస్యమీద ప్రపంచ ప్రజల దృష్టి పడుతుంది. మనకు రెడ్‌ఆర్మీ చేస్తున్న ఈ సహాయానికి తోడుగా తమతమ బాధ్యతలను నిర్వహించుతామని ఆంధ్ర ప్రజానీకం "మేడే"నాడు శపథంతీసుకోవాలి. సౌఖ్యదాయకమైన భవిష్యత్ ప్రపంచ నిర్మాణంలో మన పాత్రను నిర్వహించాలి.

★

మెడికల్ వాలంటీర్ శిక్షణ శిబిరం

కృష్ణాజిల్లా మెడికల్‌అసోసియేషన్ యాజమాన్యాన మే 1 నుండి 15వరకు బందరులో మెడికల్ వలంటీర్ శిక్షణాశిబిరం నడుపబడుతుంది. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుటకు, అంటువ్యాధుల్ని నిర్మూలించుటకు, అక్కడ తరిఫీదు యిస్తారు. శిక్షణ పొందగోరువారు యీనెల 30వ తేదీనాటికి కార్యదర్శిని కలుసుకోవాలి. (కార్యదర్శి: కె. వెంకటరామశర్మ గారు, ఎం. బి. బి. ఎస్., ఎల్. టి. బందరు.)

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE